ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 28.0
కనిష్ఠం : 24.0

2,050 హెక్టార్లలో వరి పంట మునక

ఏలూరుసిటీ, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లాలో గత రాత్రి నుంచి భారీగానే వర్షాలు కురిశాయి. గురువారం ఉదయం నుంచి కొంత వర్షాలు శాంతించినా తిరిగి సాయంత్రం నుంచి వర్షాలు కురుస్తున్నాయి. భారీ వర్షాల కారణంగా సార్వా వరి సాగులో 2,050 హెక్టార్లలో వరి పంట ముంపునకు గురైందని జిల్లా వ్యవసాయ శాఖ నివేదికలు చెబుతున్నాయి. భీమడోలు మండలంలో 140, ఉంగుటూరు 1,740, దెందులూరు 20, పెదపాడు 32, నిడమర్రు 118 హెక్టార్లలో వరి పంట మునిగిపోయింది. దాదాపు 1135 రైతులకు చెందిన ఈ వరి పంట వివిధ దశల్లో ఉండగా ముంపునకు గురైందని, ప్రస్తుతం వరి పంటకు నష్టం వాటిల్లే అవకాశాలు లేవని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. గత 24 గంటల్లో జిల్లాలోనే అత్యధికంగా నిడమర్రు మండలంలో 182.4 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైంది. జిల్లాలో సరాసరి వర్షపాతం 65.5 మి.మీ గా నమోదైంది. ఉంగుటూరు 159.6, పెదవేగి 134.6, భీమడోలు 103.6, ఏలూరు అర్బన్ 97.8, దెందులూరు 89.4, ద్వారకాతిరుమల 89.4, జీలుగుమిల్లి 88, ఏలూరురూరల్ 85, ముసునూరు 78.8, కామవరపుకోట 75.6, పెదపాడు 70, చింతలపూడి 57.2, చాట్రాయి 55.6, లింగపాలెం 53.6, టి.నరసాపురం 47.2, ముదినేపల్లి 45.6, ఆగిరిపల్లి 45.2, నూజివీడు 41.4, కైకలూరు 41.2, మండవల్లి 7.8, జంగారెడ్డిగూడెం 37, కలిదిండి 36.8, వేలేరుపాడు 25.6, బుట్టాయిగూడెం 20.4, కొయ్యలగూడెం 16.2, పోలవరం 10.6, కుక్కునూరు 8.4 మి.మీ వర్షపాతాలు నమోదయ్యాయి.


ఉంగుటూరు మండలం కైకరంలో జాతీయ రహదారి పక్కన మునిగిన పంట చేలు

ఇళ్ల మధ్య సెల్ టవర్ వద్దు..

ముసునూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అక్కిరెడ్డిగూడెంలో నివాస గృహాల మధ్య నిర్మిస్తున్న సెల్ టవర్‌ను తక్షణమే నిలిపివేయాలని స్థానికులు అధికారులను కోరారు. కలెక్టర్ వెట్రిసెల్వి, నూజివీడు సబ్ కలెక్టర్ వినూత్న, ఎంపీడీవో సత్యనారాయణలకు స్థానికులు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేయడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గురువారం ప్రజాభిప్రాయ సేకరణ గ్రామసభ నిర్వహించారు. సర్పంచ్ పులిబళ్ళ లక్ష్మీసత్యనారాయణ, ఇన్‌చార్జ్ కార్యదర్శి సయ్యద్ మోబీనల ఆధ్వర్యంలో గ్రామసభ జరపగా సభకు హాజరైన 200 మంది సెల్ టవర్ ఏర్పాటును వ్యతిరేకిస్తున్నట్టు అధికారుల సమక్షంలో సంతకాలు చేసి తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. తక్షణమే టవ ర్ నిర్మాణాన్ని పూర్తిగా తొలగించాలని, లేకుం టే మండల కార్యాలయం వద్ద ఆందోళన చేస్తామని హెచ్చరించారు. నివేదికను ఉన్న తాధికారులకు అందజేయనున్నట్లు ఇన్‌చార్జ్ కార్యదర్శి తెలిపారు. రాష్ట్ర బీసీ సెల్ ఆర్గనైజిం గ్ సెక్రటరీ మానురాజు సురేష్, వార్డు సభ్యురాలు ఎం.కోటేశ్వరమ్మ పాల్గొన్నారు.


సెల్ టవర్‌కు వ్యతిరేకంగా సంతకాలు చేస్తున్న స్థానికులు

పొగాకు పండించలేం..

- వారం వారం ధరలు తగ్గిస్తున్న వైనం
- కంపెనీలు సిండికేట్?

లోపలి పేజీలో..



మద్యం లొల్లి!

- ఒకవైపు బార్‌ల ఏర్పాటుకు కొత్తవిధానం
- మరోవైపు వైన్‌షాపుల దగ్గరే పర్మిట్‌రూమ్‌లు
- అక్కడే మద్య సేవనం.. ప్లస్ చిరుతిళ్లు
- మాకేం మిగులుతుందంటూ బార్‌ల ఏర్పాటుకు వెనుకంజ
- కొత్త పాలసీ తమకు అనుకూలం కాదంటూ తేల్చేశారు
- ఎక్సైజ్ అధికారుల ఎదుటే నిట్టూర్పులు

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

నగర పంచాయతీలు, మున్సిపాల్టీలు, కార్పొరేషన్‌లు.. ఎక్కడైనా బార్ ఏర్పాటు చేసుకోవచ్చు. ఎంచక్కా ఉదయం 10 గంటల నుంచి అర్ధరాత్రి వరకు 14 గంటలు పాటు వ్యాపారం చేసుకోవచ్చు. ఆనాటి వైసీపీ ప్రభుత్వం పాటించిందీ.. వేలం పాట. ఇప్పటి కూటమి ప్రభుత్వం పాటించబో తుందీ.. లాటరీ విధానం. పాత మద్యం పాలసీ మదింపు చేసి మరిన్ని నిర్ణయాలు. తద్వారా అదనపు ఆదాయం రాబట్టాలనేదే అసలు లక్ష్యం. ఇంకోవైపు వైన్‌షాపు పక్కనే మినీ బార్ (పర్మిట్ రూమ్)లు. ఇదే మద్యం వ్యాపారుల్లో కొంత గందర గోళానికి దారితీసింది. ఇంతకుముందు మాదిరిగా బార్‌లు ఏర్పాటు చేసుకుంటే దానికి తగ్గట్టుగానే మద్యం వ్యాపారం చేసుకునే పరిస్థితులు లేవని, ఎవరైనా కొత్త మొఖాలు చూసుకోండంటూ ఇంతకు ముందే బార్ యజమానులుగా ఉన్న వారంతా ఎక్సైజ్ అధికారుల ఎదుట తేల్చేశారు. గతంలో ఉన్నట్లుగా బార్‌లు సంఖ్య ఉంటుందా, లేకుంటే మరింత పెరుగుతాయా.. ఇదే సందిగ్ధం.

నూతన మద్యం పాలసీ కాస్త కొంత మంది వ్యాపారుల చెంప చెళ్లుమనిపించింది. పాలసీలో అనేక ఆంక్షలు విధించింది. పాత పద్ధతిని మార్చే శారు. మద్యం అమ్మకాల ద్వారా అత్యధిక ఆదా యం లభించాలనే లక్ష్యంతోనే వ్యవహరించారు. ఏకంగా ఒకవైపు కొత్తగా బార్‌ల లైసెన్సులు పొందాలంటే దరఖాస్తు రూపంలో రూ.ఐదు లక్షలు నాన్ రిఫండబుల్ (వెనుకకు ఇవ్వని) కింద చెల్లించాల్సిందే. ఇంకోవైపు ఒక బార్‌కి నాలుగు దరఖాస్తులు వస్తేనే తప్ప లాటరీ విధానం అమ లులో ఉంటుందని షరతు విధించారు. ఇంతకు ముందు బార్ లైసెన్సు పొందేందుకు ఈ వ్యాపా రంలో అనుభవం ఉన్న హేమాహేమీలు రంగం లోకి దిగేవారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే దానికి అనుకూలంగా ఉన్న నేతలు, ఎమ్మెల్యేలు రంగం లోకి దిగి బార్‌లు, వైన్‌షాపులు సొంతం చేసు కోవడం ఆనవాయితీగా మారింది. గత ప్రభుత్వం లో ఒక బార్ లైసెన్సు గడువు ఐదేళ్లుగా ఉండేది. తాజా మద్యం విధానంలో ఈ గడువు కాస్త మూడేళ్లకు కుదించారు. అంటే ప్రతీ ఏడాది జాగ్రత్తగా వ్యాపారం చేసుకుంటేనే ఒడ్డెక్కేది. కానీ కూటమి ప్రభుత్వం ఒక వైపు బార్ లైసెన్సు విధానంలో మార్పులు, చేర్పులకు దిగింది. ఇంకో వైపు ప్రభుత్వం నిర్దేశించనట్లుగానే మాత్రమే అమ్మ కాలు సాగించాలని, 99 రూపాయల రకం అమ్మ కానికి వీల్లేదని కఠిన ఆంక్ష విధించింది. ఇంకోవైపు బార్‌లకు లైసెన్సులు (మిగతా 10వ పేజీలో)

చందాలు.. దందాలు

బార్‌లు, వైన్‌షాపులు సహజంగానే పెద్ద తలకాయల చేతుల్లో ఉంటాయి. కానీ మద్యం వ్యాపారం సక్రమంగా చేయాలంటే ప్రతి పక్షంతో పాటు మిగతా పార్టీ నేతలు, కార్య కర్తలను కాస్త చూసుకోవాల్సిందే. ఎందుకంటే వివాదాలు పెంచి పోషించకుండా కాస్త మత్తులో దింపా ల్సిందే. దీనికి తోడు ఎక్సైజ్, పోలీస్ చిన్నచితకా కులసంఘాల నేతలకు అంతోకొంతో ముట్ట చెప్పాల్సిందే. ఉదాహరణకు ఏలూరులో ఒక బార్ నిర్వహించాలంటే సరాసరిన రూ.80 లక్షల వరకు మోయాల్సిందేనని అంచనా వేస్తు న్నారు. ఈ కారణాల ద్వారా బార్‌లు నిర్వహ ణకు ముందుకొచ్చేవారి సంఖ్య తగ్గుముఖం పట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి.


వర్క్‌షాపులో మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి

వికసిత భారత్ సాధనకు సమష్టి కృషి : కలెక్టర్

ఏలూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : అన్నిరంగాల్లో భారతదేశం మొదటి స్థానంలో నిలిచేందుకు వికసిత్ భారత్ సాధనకు అందరూ సమష్టి కృషితో పని చేయాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి పిలుపునిచ్చారు. వికసిత్ భారత్-2047 లక్ష్యంగా 'స్కూలింగ్- బిల్డింగ్స్ బ్లాక్స్' అనే అంశంపై జిల్లాలోని విద్యాశాఖ అధికారులతో కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన ఒకరోజు వర్క్‌షాపులో కలెక్టర్ వెట్రిసెల్వి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. భారత్ ఆర్థిక వృద్ధిని సాధించాలంటే వివిధ రంగాల్లో ముందుండాలని, ఈ నేపథ్యంలో అత్యంత కీలకమైందీ నాణ్యమైన పాఠశాల విద్యతో పాటు చక్కని భవనాలు, పూర్తిగా మౌలిక సదుపాయాలు అవసర మన్నారు. డీఈవో ఎం వెంకటలక్ష్మమ్మ, సర్వశిక్ష అభియాన్ ఏపీసీ డాక్టర్ కె పంకజ్‌కుమార్, జెడ్పీ సీఈవో ఎం శ్రీహరి, సోషల్‌వెల్ఫేర్ జేడీ విశ్వమోహన్‌రెడ్డి, ఐసీడీఎస్ పీడీ పి శారద, ఐటీడీఏ పీవో కె రవిప్రసన్నకుమార్, డిప్యూటీ విద్యాశాఖాధికారులు పాల్గొన్నారు.

పాడైన భవనాల్లో పాఠశాలలు నిర్వహించవద్దు

- విద్యాశాఖ డైరెక్టర్ ఆదేశాలు జారీ

ముదినేపల్లి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): అధిక వర్షాల సమయాల్లో పాఠశాలల నిర్వహణలో విద్యా శాఖ అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయ రామరాజు గురువారం ఆదేశాలు జారీ చేశారు. పాఠశాలల భవ నాలు, ఆవరణలను పరిశీలించి తరగతుల నిర్వ హణకు అనుకూలంగా లేకపోతే విద్యార్థులకు ప్రత్యా మ్నాయ భవన వసతిని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పాఠశాల భవనాల్లో విద్యుత్ సమస్యలు లేకుండా, వైరింగ్ వల్ల ప్రమా దాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొ న్నారు. గోడలు పాడైపోయిన తరగతి గదుల్లోకి విద్యా ర్థులను కూర్చోబెట్టవద్దని, ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడంలో ఎటువంటి నిర్లక్ష్యం చేయ వద్దని సూచించారు. గ్రామ సచివాలయాల ఇంజ నీరింగ్ అసిస్టెంట్లు తమ పరిధిలోని పాఠశాలల భవ నాలను తనిఖీ చేసేందుకు సేఫ్టీ ఆడిట్‌ను నిర్వహిం చాలని విద్యాశాఖ డైరెక్టర్ పేర్కొన్నారు. ప్రమాదకర మైన కాలం తీరిన భవనాల్లో పాఠశాలలు నిర్వహించ వద్దని ఆయన స్పష్టం చేశారు.



చక్ర బంధనం!

- ఆక్రమణల చెరలో రోడ్లు.. ముందుకు కదలని వాహనాలు
- పని చేయని సిగ్నల్ లైట్ల వ్యవస్థ.. కొన్నిచోట్ల అసలు లైట్ల ఊసేలేదు
- నిబంధనలు బేఖాతర్.. ఎవరికీ పట్టని వైనం

ఆంధ్రజ్యోతి విజిట్

ఇరుకు రోడ్లు..ఆపై ఆక్రమణలతో జిల్లాలో ఏలూరు నగరంతో పాటు పట్టణాల్లో, మండల కేంద్రాల్లో ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి. ప్రధాన సెంటర్లలో ట్రాఫిక్ సిగ్నల్స్ వ్యవస్థ లేకపోవడంతో సమస్య మరింత జఠిలంగా మారుతోంది. రోడ్లపైనే ఇష్టారాజ్యంగా ద్విచక్ర వాహనాలు, ఆటోలను నిలిపి వేయడం ట్రాఫిక్ సమస్యలకు ప్రధాన కారణంగా నిలుస్తోంది. అన్నిచోట్ల ట్రాఫిక్ పోలీసులు లేకపోవడంతో ట్రాఫిక్ నియంత్రణలో సమస్యలు ఏర్పడుతున్నాయి. పెరిగిన జనాభా కు అనుగుణంగా రోడ్ల విస్తరణ జరగకపోవడం మరో కారణంగా నిలుస్తోంది. ట్రాఫిక్ సమస్యలు, సిగ్నల్స్ వ్యవస్థ, నిబంధనల ఉల్లంఘ నలు తదితర అంశాలపై గురువారం ఆంధ్రజ్యోతి విజిట్ నిర్వహించనగా పలు సమస్యలు వెలుగుచూశాయి.

పని చేయని సిగ్నల్ లైట్లు

ఏలూరు క్రైం : జిల్లా కేంద్రమైన ఏలూరు నగరంలో ట్రాఫిక్ చక్రబంధంలో వాహన దారు లు, ప్రజలు నిత్యం చిక్కుకుపోవాల్సిందే. జిల్లా కేంద్రానికి వివిధ అవసరాల నిమిత్తం రోజుకు 50 వేల మంది పైబడే వస్తూ వెళ్తూ ఉంటారు. నగరంలో ప్రధానంగా పాతబస్టాండ్, ఫైర్‌స్టేషన్ ప్రాంతాల్లో మాత్రమే సిగ్నల్ లైట్లు ఉన్నాయి. వర్షం వచ్చా యంటే ఇవి కూడా పనిచేయవు. గురువారం రాత్రి ఓవర్ బ్రిడ్జిపై నుంచి వచ్చే వాహనాలకు రెడ్‌సిగ్నల్ పడింది. కొత్త బస్టాండ్ నుంచి వచ్చే వాహనాలకు, ప్రభుత్వాస్పత్రి రోడ్డు నుంచి వచ్చే వాహనాలకు ఒకేసారి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. కాని ఎంతసేపటికి ఓవర్ బ్రిడ్జి వైపు నుంచి వచ్చే వాహనాలకు గ్రీన్ సిగ్నల్ రాకపోవడంతో వాహనాలు నిలిచిపోయాయి. ట్రాఫిక్ సీఐ లక్ష్మణరావు, హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసరావు యుద్ధ ప్రాతిపదికన సమస్యను పరిష్కరించారు. పాతబస్టాండ్‌లో సిగ్నల్ సమస్య దారుణంగా ఉంది. సిగ్నల్ లైట్లు కొత్త బస్టాండ్ నుంచి పాతబస్టాండ్ వెళ్లేవరకూ కనిపించవు. నగరంలో ప్రధానంగా 55 ట్రాఫిక్ పాయింట్లు ఉండగా ట్రాఫిక్ పోలీసులు కేవలం 15 పాయింట్లలోనే విధులను నిర్వర్తించగలుగుతున్నారు. ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు 14 మంది కానిస్టేబుళ్ల కొరత ఉంది. నిత్యం తంగెళ్ళమూడి, బిర్లాభవన్, గడియారస్తంభం రోడ్డు, పెదపాడు రోడ్డు బ్రిడ్జి, ఓవర్ బ్రిడ్జి, ఫైర్‌స్టేషన్, శనివారపుపేట రోడ్డులలో ట్రాఫిక్ జామ్ అవుతూనే ఉంది. నగరంలో వృద్ధులు, సైకిళ్లపై, కాలినడకన స్కూళ్లు, కాలేజీలకు వెళ్లే విద్యార్థులు రోడ్డు దాటాలంటే వీరు పడే అవస్థ అంతాఇంతా కాదు. నగరంలో ట్రిపుల్ రైడింగ్ వాహనాలు తిరుగుతున్నా, నెంబర్ ప్లేట్‌లేని వాహనాలు తిరుగుతున్నా ట్రాఫిక్ పోలీసులు తమకు ఏమి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. శనివారపుపేట లోబ్రిడ్జి మార్గంలో నిత్యం ఇరువైపులా ట్రాఫిక్‌నకు అంతరాయం ఏర్పడుతూనే ఉంది. తంగెళ్ళమూడి ప్రాంతంలో, ఆస్పత్రి రోడ్డులోను తోపుడు బళ్ళవారు, షాపుల వారు తమ వ్యాపార సామగ్రి పెట్టడంతో రోడ్డు ఇక్కచిక్కి వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతూనే ఉంది. ఫైర్‌స్టేషన్ నుంచి ఓవర్ బ్రిడ్జి కింద నుంచి పవర్‌పేట వెళ్లే దారిలో అయితే రోడ్లమీదే వ్యాపారాలు కొనసాగిస్తూ ట్రాఫిక్‌నకు అంతరాయం కల్పిస్తున్నా తమకు ఏమి తెలియనట్లే ట్రాఫిక్ పోలీసులు, నగర పాలక సంస్థ అధికారులు వ్యవహరిస్తున్నారు.


ఏలూరు ఫైర్‌స్టేషన్ వద్ద సిగ్నల్స్ సమస్యతో గురువారం రాత్రి నిలిచిపోయిన వాహనాలు

జాతీయ రహదారి అయినా..

ఉంగుటూరు : ఉంగుటూరు మండలంలో ట్రాఫిక్ పోలీసులు లేరు. ప్రధాన సెంటర్లలో ట్రాఫిక్ సిగ్నల్స్ కానరావు. పేరుకు జాతీయ రహదారితో కూడిన గ్రామాలయినా పూర్తి గ్రామీణ వాతావరణం కావడంతో ఉంగుటూరు, నారాయణపురం, చేబ్రోలు, కైకరం, బాదంపూడి వై జంక్షన్‌ల వద్ద ఏదైనా ప్రమాదాలు జరిగిన పుడు మాత్రమే చేబ్రోలు పోలీసులు ట్రాఫిక్ నియంత్రణ చేపడతారు. బాదంపూడి వై జంక్షన్ వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతు న్నా యి. అక్కడ హైవే సిబ్బంది మరమ్మతుల సమయంలో, వి.ఐ.పి.ల రాక సమయంలో ట్రాఫిక్ నియంత్రణ కోసం కానిస్టేబుళ్లను నియమిస్తుంటారు. ఉంగుటూరు, నారాయణ పురం, చేబ్రోలు, కైకరంల వద్ద హైస్కూళ్లు హైవే పక్కన ఉండడంతో ఉదయం, సాయంత్రం పాఠశాలల సమయంలోనైనా ట్రాఫిక్ కాని స్టేబుల్‌ను ఏర్పాటు చేయాలని ఆయా గ్రామ స్థులు హైవే అధికారులకు, ప్రజా ప్రతినిధు లకు పలుమార్లు విన్నవించారు. సోమవారం ఉంగుటూరు వారపు సంత కావడంతో వంతెన వద్ద ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. నారాయణపురం వంతెనకు రంధ్రం పడడంతో అక్కడ ద్విచక్రవాహనాలు మినహా అన్నింటిని బంద్ చేయడంతో పాటు చేబ్రోలు పోలీసు స్టేషన్ పక్కనుంచి ప్రత్యామ్నాయ మార్గాన్ని ఏర్పాటు చేసినా ప్రస్తుతం రహదారులు వర్షాలు పాడయ్యి గోతులు పడ్డాయి. చేబ్రోలు వద్ద రైల్వే గేటు,హైవే, ఏలూరు కాల్వ ఒకే ప్రాంతంలో ఉండడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. చేబ్రోలు,నారాయణపురం రైల్వే బ్రిడ్జిల వద్ద వర్షాలకు కళాశాలకు వెళ్లే విద్యార్థులు, ప్రజలు నీటిలో నుంచి వెళ్లాల్సి వస్తోంది.

సిగ్నల్ లైట్ల సౌకర్యం లేదు..

చింతలపూడి : చింతలపూడి నగర పంచాయతీలో నాలుగు రోడ్ల కూడలి బోసుబొమ్మ సెంటర్ ఉదయం, సాయంత్రం స్కూలు బస్సులు, మార్కెట్‌కు వచ్చే వినియోగ దారులతో రద్దీగా ఉం ది. ఈ మండలం తెలంగాణ సరిహద్దు లో ఉంది. సాయం త్రం వేళ పామా యిల్ లోడు లారీలు, తెలంగాణ వైపు వెళ్లే లారీలు ఎక్కువగా తిరుగుతుంటాయి. ఇటీవల ఈ కూడలిలో ట్రాఫిక్ ఐల్యాండ్, సీసీ కెమేరాలు ఏర్పాటు చేశారు. కాని సిగ్నల్ లైట్‌లు లేవు. సాయంత్రం వేళ రద్దీ ఎక్కువ సమయా ల్లో మాత్రమే ట్రాఫిక్ కానిస్టేబుల్ పర్యవేక్షణ ఉంటుంది. ఇక మోటారు సైకిళ్ల, స్కూటీలపై ముగ్గురు, నలు గురు వెళ్తున్నా పట్టించుకునేవారే లేరు. ఈ సెంటర్‌లో ఆక్రమణలు ఎక్కువగా ఉన్నాయి. కూరగాయలు, ఇతర ఉత్పత్తులు రోడ్లపైనే విక్రయిస్తుంటారు. ఇవి (మిగతా 10వ పేజీలో)


చేబ్రోలు వద్ద రోడ్డు పక్కనే నిల్చున్న ప్రయాణికులు

ఇరుకు రోడ్లతో అవస్థలు

కైకలూరు : కైకలూరులో 50 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన రహదారుల వెడల్పు పెంచే ప్రయత్నాలు ఎప్పుడూ చేయలేదు. జనాభా పెరుగుదలతో పాటు రహదారుల విస్తరణ లేకపోవడం ట్రాఫిక్ ఇబ్బందులు పెరిగాయి. ఎదురెదురుగా వాహనాలు వస్తే తప్పుకోలేని పరిస్థితి నెలకొంది. ప్రధాన సెంటర్లలో పోలీ సు బందోబస్తు లేక ప్రజలు ట్రాఫిక్ ఇబ్బం దులను ఎదుర్కొంటున్నారు. సీతయ్య హోట ల్ సెంటర్, కలిదిండి రోడ్డులోని తాళ్ళకొట్టు సెంటర్, శ్రీశ్యామలాంబ అమ్మవారి కల్యాణ మండపం ఎదురుగా ఉన్న ఖాళీ ప్రదేశాల్లో పదుల సంఖ్యలో కార్లు, ఆటోలు నిలిపివేస్తు న్నారు. జాతీయ రహదారి వెంబడి వారపు సంత, రైతుబజారు ప్రాంతాల్లో రహదారుల పైకి దుకాణాలు ఏర్పాటు చేయడంతో ఎదురెదురుగా వాహనాలు వస్తే తప్పుకోలేని పరిస్థితులు ఏర్పడుతున్నాయి. మార్కెట్ యార్డ్, ఏలూరు రోడ్డు సెంటర్‌లో మలుపు ఉండడంతో నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తు తూనే ఉన్నాయి. బస్టాండ్, మాగంటి సెంటర్ల లో ఆటోలు రహదారిలో నిలిపి వేయడంతో ప్రయాణికుల రాకపోకలకు తీవ్ర అసౌకర్యం కలుగుతుంది. ఉదయం సాయంత్రం వేళల్లో ప్రధాన కూడళ్లల్లో పోలీసుల పర్యవేక్షణ లేక ఎక్కడికక్కడే ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి.



స్వాతంత్ర్య వేడుకలకు సర్వం సిద్ధం

ఏలూరు,ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): 79వ స్వాతంత్ర్య వేడుకలకు నగరంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్స్ ముస్తాబైంది. శుక్రవారం ఉదయం నిర్వహించే ఈ వేడుకల్లో రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. ఉదయం 8.45 గంటలకు మంత్రి చేరుకుని జాతీయ జెండాను ఆవిష్కరిస్తారు.ఆయన సందేశం అనంతరం 9.30 గంటలకు పోలీస్ కవాతు, 10 గంటలకు వివిధ శాఖ ప్రగతి శకటాల ప్రదర్శన, 10.20 గంటలకు విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు, 10.55 గంటలకు ప్రశంసాపత్రాల ప్రదానం, అనంతరం వివిధ శాఖ స్టాల్స్ సందర్శన, జాతీయ గీతాలాప నలు కార్యక్రమాలుంటాయి. కాగా పంద్రాగస్టు వేడుకకు కలెక్టరేట్ అందంగా ముస్తాబైంది. జాతీయ జెండా రంగుల విద్యుత్ దీపాల అలంకరణ చేశారు.



ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

స్వాతంత్ర్య వేడుకలకు పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. గురువారం ఆమె పరేడ్ గ్రౌండ్స్‌ను పరిశీలించారు. వర్షాల నేపథ్యంలో వేడుకలకు ఎటువంటి ఆటంకం కలగ కుండా చూడాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట ఏఎస్పీ సూర్య చంద్రరావు, ఆర్డీవో అచ్యుత అంబరీష్, డీఎస్పీ శ్రావణ్ కుమార్, ఏఆర్ డీఎస్పీ చంద్ర శేఖర్ పాల్గొన్నారు.

నేటి నుంచే మహిళలకు ఉచిత బస్సు

- నేడు మంత్రి పార్థసారథి చేతుల మీదుగా ప్రారంభం

ఏలూరు,ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఆర్టీసీ బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణా లకు ప్రజారవాణాశాఖ అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది. సీఎం చంద్రబాబు విజయవాడలో ప్రారంభించే సమయంలోనే ఏలూరులోని కొత్తబస్టాండ్‌లో శుక్రవారం సాయంత్రం 5 గంటలకు రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి చేతుల మీదుగా బస్సు ప్రయాణాలకు టిక్కెట్ జారీ చేయనున్నారు. జిల్లాలోని ఎమ్మెల్యేలు, కలెక్టర్ వెట్రిసెల్వి, ఆర్టీసీ అధికారులు హాజరుకానున్నారు. ప్రభుత్వ ఇంచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా అమలు చేసే ఉచిత బస్సుల్లో ప్రయాణానికి బాలికలు, మహిళలు, ట్రాన్స్‌జెండర్లకు రాష్ట్రంలో ఎక్కడికైనా ప్రయా ణించే వెసులుబాటు ఇచ్చారు. ఆధార్‌తో పాటు ప్రభుత్వం జారీ చేసిన గుర్తింపు కార్డులను ప్రయాణ సమయంలో చూపడం తప్పనిసరి. ప్రతీ ఒక్కరికి జీరో టిక్కెట్‌ను జారీ చేస్తారు.

వాస్తవంగా ఐదు రకాలు బస్సులకు అవకాశం ఇచ్చారు. ఇందులో ఏలూరు జిల్లా నుంచి మూడు డిపోల పరిధిలో వివిధ రూట్లలో 309 బస్సులు తిరుగుతుండగా, పల్లెవెలుగు,అల్ట్రా పల్లెవెలుగు బస్సులు 162, ఎక్స్‌ప్రెస్ సర్వీసులు 15 తిరుగుతున్నాయి. దీంతో జిల్లాలో 177 బస్సుల్లోనే వారి ప్రయాణాలకు అవకాశం ఉండనుంది. ఇదిలా ఉండగా అంతర్రాష్ట్ర సర్వీసులను మినహాయిం చడంతో సత్తుపల్లి, ఇతర ప్రాంతాలకు వెళ్లే వారు ఖచ్చితంగా టిక్కెట్‌ను తీసుకోవాల్సి ఉంటుంది.తెలంగాణ నడిపే అశ్వారావుపేట, సత్తుపల్లి బస్సులకు టిక్కెట్ తప్పనిసరి.


నవుడూరులో నేషనల్ ఫ్లాగ్ టవర్

తాపీమేస్త్రి దేశభక్తి

జాతీయ స్ఫూర్తిని నింపేందుకు ఫ్లాగ్ టవర్ నిర్మాణం

భీమవరం టౌన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : ఆయన ఒక తాపీమేస్త్రి.. ఆయన దేశభక్తి అభినందనీయం..వీరవాసరం మండలం నవుడూరు జంక్షన్‌కు చెందిన సుబ్బారావు 30 అడుగుల ఎత్తులో నేషనల్ ఫ్లాగ్ టవర్ నిర్మించి అందులో భరతమాత విగ్రహాన్ని పెట్టి తన దేశభక్తి చాటుకున్నారు. దాదాపు 26 సంవత్సరాల క్రితం ఎన్నో వ్యయ ప్రయాసలు పడి ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ఈ టవర్ నిర్మాణం చేసిన సుబ్బారావు నేటికి ఏదో దేశభక్తి కార్యక్రమం చేపడుతూనే ఉంటారు. అబ్దుల్ కలాం, వివేకానంద విగ్రహాలతో పాటు అన్నం పెట్టే రైతన్న, దేశాన్ని కాపాడే సైనికుల విగ్రహా లను ఏర్పాటు చేశారు. ప్రతి ఒక్కరిలో దేశభక్తి పెంపొందించాలనే ఉద్దేశంతో ఫ్లాగ్ టవర్ నిర్మాణం చేపట్టినట్టు సుబ్బారావు చెబుతున్నారు.

స్వాతంత్ర్య.. స్మృతులు

బ్రిటిషర్లకు చుక్కలు చూపిన సుబ్బారెడ్డి

మొదటి గిరిజన స్వాతంత్ర్య సమరయోధుడు


కారుకొండ సుబ్బారెడ్డి (ఫైల్ ఫొటో)

బుట్టాయగూడెం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మన్యం ప్రాంతంలో బ్రిటిష్ పాలకులను గడగడలాడించి ఉరికంభమెక్కిన మొదటి గిరిజన స్వాతంత్ర్య సమరయోధుడు కారుకొండ సుబ్బారెడ్డి. గిరిజన స్వాతంత్ర్య పోరాట యోధుడుగా చరిత్రలో నిలిచిపోయారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఢిల్లీలో ఏర్పాటు చేసిన సెమినార్‌లో ఈ పోరాటయోధుడి గురించి తెలిసింది. ఇతని ముని ముని మనుమలు ప్రస్తుతం జీలుగుమిల్లి మండలం అంకన్నగూడెం సమీపంలోని ఆర్ అండ్ ఆర్ కాలనీలో ఉంటున్నారు. సుబ్బారెడ్డి గురించి వీరికి ఏమి తెలియకపోవడం గమనార్హం. సిపాయిల తిరుగుబాటుకు ముందే 1852లో ఏజెన్సీ ప్రాంతం కొరుటూరు కేంద్రంగా సుబ్బారెడ్డి బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా ఉద్యమించాడు. సుమారు ఆరు సంవత్సరాల పాటు బ్రిటిషర్లను అడవిలోకి అడుగు పెట్టనియ్యలేదు. పది మందితో ప్రారంభమైన ఆయన సైన్యం చివరకు 600 మందికి పెరిగింది. పన్ను వసూళ్ళ రద్దుతో బ్రిటిష్ పాలకులపై పగ పెంచుకున్న సుబ్బారెడ్డి చివరకు తిరుగుబావుటా ఎగురవేశాడు. బ్రిటిష్‌వారిని ఎదిరించిన మొదటి గిరిజన నాయకుడిగా చరిత్రలో నిలిచాడు. అనేకమార్లు బ్రిటిష్‌వారితో జరిగన పోరాటాల్లో విజయం సాధించాడు. 1852 నుంచి 1858 వరకు బ్రిటిష్ పాలకులను మూడు చెరువుల నీళ్ళు తాగించి ముచ్చెమటలు పట్టించాడు.1858 జూన్ 11న చింతపల్లి దాసిరెడ్డి, మరికొందరి తిరుగుబాటుదారులు ఇచ్చిన సమాచారంతో బ్రిటిషర్లు సుబ్బారెడ్డిని మరికొందరు అనుచరులను నిర్బంధించారు. 1858 అక్టోబరు 7న బుట్టాయగూడెంలో సుబ్బారెడ్డి, కోర్ల సీతారామయ్యలను ఉరితీశారు. అస్థిపంజరాన్ని ఇనుప పెట్టిలో పెట్టి రాజమండ్రిలోని కోటగుమ్మం వద్ద వేలాడదీశారు. 1920 వరకు అస్థిపంజరం అక్కడే ఉన్నట్లు చరిత్రకారుల సమాచారం. ఇతనితో పాటు మరో 10 మందిని ఉరి తీసిన బ్రిటిషర్లు 35 మంది అనుచరులకు జీవిత ఖైదు విధించి గుంటూరు సెంట్రల్ జైలుకు తరలించి మరో 8 మందిని అండమాన్ జైలుకు పంపారు. సుబ్బారెడ్డిని పట్టిస్తే 2500 రూపాయలు ఇస్తామని అప్పట్లోనే బ్రిటిష్‌వారు ప్రకటించారు. ఆయన వారసుడు కారుకొండ అబ్బాయిరెడ్డి ప్రస్తుతం జీలుగుమిల్లి అంకన్నగూడెం సమీపంలో నిర్మించిన ఆర్ అండ్ ఆర్ కాలనీలో ఉంటున్నాడు. ప్రస్తుతం సుబ్బారెడ్డి వారసులు ఇద్దరు మాత్రమే ఉన్నారు.


సుబ్బారెడ్డి కుటుంబానికి చెందిన కారుకొండ అబ్బాయిరెడ్డి

గాంధీ అడుగు జాడలు

నేడు స్వాతంత్ర్య దినోత్సవం

తిలక్ స్వరాజ్య నిధికి 3 సార్లు ఏలూరు వచ్చిన బాపూజీ

(ఏలూరు-ఆంధ్రజ్యోతి): భారత దేశస్వాతంత్ర్య సమరం కోసం స్వరాజ్య నిధి పేరిట విరాళాల సేకరణ జోరుగా సాగుతున్న తరుణంలో మహాత్మా గాంధీ ఏలూరు నగరంలో మూడుసార్లు పర్యటించారు. 1921 ఏలూరులో పర్యటించారు. ఏప్రిల్ 3న రాజమహేంద్రవరం నుంచి రైలులో గాంధీ, కస్తూరిబాయ్ దంపతులు ఏలూరు రైల్వేస్టేషన్‌కు విచ్చేశారు. పుర ప్రముఖులు మోతే గంగరాజు జమీందారు, కోమంచి సీతారామయ్య, వల్లూరు రామారావు, ఎర్రమిల్లి గంగయ్య, వారణాసి రామమూర్తి, బడేటి వెంకట్రామయ్యలు పుష్పమాలలు వేసి స్వాగతం పలికారు. రెండు గుర్రాల బగ్గి మీద ఊరేగింపుగా నగరంలోకి తీసుకువచ్చారు. 50 వేల మందిపైగా వచ్చిన ప్రజలతో ఏఎస్ఆర్ స్టేడియం నిండిపోయింది.నగరంలోని కెనాల్ టౌన్‌హాల్‌లో వచ్చి ఆగారు. అక్కడ సభలో గాంధీ మాట్లాడారు. ఇక్కడే


గాంధీజీ సభ నిర్వహించిన పడమరవీధి గాంధీ మైదానం ప్రాంగణం


ఏలూరు జాతీయ గాంధీ మహా విద్యాలయంలో 1921లో మహాత్మాగాంధీ నాటిన మేడిచెట్టు

తిలక్ స్వరాజ్యనిధికి కారకులైన లోక్‌మాన్య బాలగంగాధర్ తిలక్ చిత్రపటం ఆవిష్కరించారు. దక్షిణపు వీధి మార్కండేయస్వామి గుడిలో పిల్లలకు అక్షరాభ్యాసం చేశారు.

మేడిచెట్టు నాటి.. స్కూల్‌కు అంకురార్పణ

మంత్రి ప్రగడ భుజంగరావు అగ్రహారంలోని 3 ఎకరాలు స్థలంను స్కూల్ కోసం దానం చేశారు. దీంతో అక్కడికక్కడే శంకుస్థాపన చేసి చదువులు ఎలా చెప్పాలి ? టీచర్లు ఏ విధంగా నడచుకోవాలన్న దానిపై గాంధీ అవగాహన కల్పించారు. 1921లో ఇక్కడే పలు మొక్కలు నాటగా, అప్పట్లో నాటిన మేడిచెట్టు ఇప్పుడు ఇక్కడ దర్శనమిస్తుంది. అయితే మోడువారి పోయింది. ఈ స్కూల్‌లో గాంధీ విగ్రహాన్ని నెలకొల్పారు.

పడమర వీధిలో బహిరంగ సభ

1929లో ఖద్దర్ యాత్ర ఉద్యమంలో భాగంగా గాంధీ మహాత్ముడు గాంధీ మహావిద్యాలయంలో విడిది చేశారు. టౌన్‌హాల్లో ఏప్రిల్ 23న మొక్కలు నాటారు. రాట్నం వడికారు. అనంతరం పడమర వీధిలో పెద్ద మైదానంలో భారీ బహిరంగ సభ నిర్వహించారు. తర్వాత రోజు ఏప్రిల్ 24న పోతు నూరు, కొవ్వలి, దెందులూరు, గుండు గొలను సందర్శించారు. ఏప్రిల్ 25న తాడేపల్లిగూడెం, ఆకివీడు, పెనుమంత్ర, మట్లపాలెం, పాలకొల్లు, తణుకు, చాగల్లు, కొవ్వూరులో పర్యటించిన గాంధీకి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. 1933లో పడమర వీధి భారీ ఖాళీస్థలంలో గాంధీ ప్రసంగం సాగింది. అప్పట్లో ఆయన వచ్చినప్పుడు మైక్‌లు వాడకం ప్రారంభం అయ్యింది. క్రమేణా ఈ స్థలం గాంధీమైదానంగా స్థిరపడింది. ఇక్కడ గాంధీ, కస్తూరిబాయి, స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాలతో గత స్మృతులకు ఆలవాలంగా ఉన్నాయి. గాంధీ నాలుగోసారి కూడా ఏలూరులో అడుగు పెట్టారు. 1946 జనవరి 26న కోలకతా నుంచి మద్రాస్ వెళుతున్నప్పుడు ఆయన ఏలూరు రైల్వేస్టేషన్‌లో కొద్దిసేపు ఆగారు.



స్వాతంత్ర్య సమర యోధుల పార్కు

తణుకు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య ఉద్యమంలో ఎంతోమంది తణుకు గడ్డ నుంచి పాల్గొన్నారు. కుటుంబ సభ్యులకు దూరంగా రహస్య జీవితం గడిపిన వారు ఉన్నారు. మరికొంత మంది సంవత్సరాల తరబడి జైలు జీవితం గడిపారు. అటువంటి మహానుభావులను స్మరించుకోవడానికి తణుకు బ్యాంకు కాలనీలోని పార్కు వద్ద మున్సిపాల్టీ స్వాతంత్ర సమరయోధుల పార్కును ఏర్పాటు చేశారు. నేటి తరాల వారికి వారి సేవలను నిత్యం గుర్తు ఉండేలా దోహదపడాలనే లక్ష్యంతో దీనిని ఏర్పాటు చేశారు. కోడూరి రామరాయ వర్మ, నడింపల్లి తిరుపతిరాజు, సంకురాత్రి సుబ్బారావు, శనివారపు సుబ్బారావు, కొవ్వలి గోపాలరావు, కొవ్వల కనకమ్మ, ముదిగంటి జగ్గన్న శాస్త్రి, చెరుకువాడ వెంకట నరశింహం పంతులు, యర్రమిల్లి రామనాథం, సంకు అప్పారావు, వంక సత్యనారాయణ, భూపతిరాజు సుబ్బరాజు, కలిదిండి పెద సుబ్బరాజు, సూరంపూడి మహాలక్ష్మి, అజ్జరపు సుబ్బారావు, యర్రమిల్లి నరశింహారావు, కత్రంపల్లి సుబ్బారావు, చల్లా అప్పారావుల విగ్రహాలు ఏర్పాటు చేశారు.

మహాత్ముని ఆశయాలకు ప్రతీక.. పెదనింద్రకొలను గాంధీ భవనం

నిడమర్రు ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) మహాత్ముని ఆశయాలను సామాన్య ప్రజానీకానికి తెలియజేయాలనే లక్ష్యంతో మాజీ విద్యామంత్రి, సర్వోదయ మండలి నాయకుడు దివంగత చింతలపాటి వరప్రసాదమూర్తి రాజు గాంధీభవనం నిర్మించారు. 1967లో నిర్మాణం ప్రారంభించగా రెండు సంవత్సరాల పాటు సుదీర్ఘంగా సాగిన ఈ మహోత్తర నిర్మాణం చూపరులను విశేషంగా ఆకట్టుకుంటుంది. గాంధీజీ ప్రవచించిన సత్యం, అహింస, స్వదేశీ విధానాలను ప్రజలకు, భవిష్యత్తు తరాలకు తెలియజేయాలనే లక్ష్యంతో మూర్తిరాజు సుమారు 12 ఎకరాల పొలం పెదనింద్రకొలనులో సేకరించి ఈ గాంధీభవనం నిర్మించారు. భారత పార్లమెంటు భవనాన్ని పోలిన విధంగా దీన్ని నిర్మించారు. ఈ భవనం ప్రత్యేకత ఏమిటంటే భవనం మధ్యలో ఎటువంటి పిల్లర్లు లేకుండా ఉండడం. సుమారు 100 అడుగులు మేర ఎటువంటి సపోర్టు లేకుండా ఏక స్లాబ్ ఉండడం ఆశ్చర్యం కల్గిస్తోంది. 60 సంవత్సరాల క్రితమే ఏ విధమైన టెక్నాలజీ లేని సమయంలో ఈ నిర్మాణం జరగడం అద్భుతమని చెబుతుంటారు. ఇంకో విశేషం ఏమిటంటే ఈ భవనం చుట్టూ వరండాలో పైన మొదటి అంతస్తులో అద్భుతమైన గ్రంథాలయం ఏర్పాటు చేశారు. అప్పట్లోనే మూర్తిరాజు సుమారు నాలుగు వేల గ్రంథాలను, జీవిత చరిత్రలను, స్వాతంత్ర పోరాట పుస్తకాలను సేకరించి భద్రపరిచారు. మరో విశేషమిటంటే గాంధీ భవనం లోపల గోడలపై స్వాతంత్ర్య పోరాట



దృశ్యాలను 3డి రూపంలో బొమ్మలను ఏర్పాటు చేశారు. నూలు వడికే యంత్రంతో , స్వదేశీ ఉద్యమం పోరాట దృశ్యాలు అత్యద్భుతంగా తీర్చిదిద్దారు. ఈ భవనాన్ని సర్వోదయ మండలి ఆధ్వర్యంలో అభివృద్ధి చేసేందుకు ప్రయత్నస్తున్నామని సర్వోదయ మండలి రాష్ట్ర కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు తెలిపారు.

ముంచిన వాన !

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా కురిసిన భారీ వర్షాలకు పంట పొలాలు నీట మునిగాయి. డ్రెయిన్లు పొంగిపొర్లాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఎడతెరపి లేకుండా బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షాలతో జన జీవనం స్తంభించింది. భారీ వర్షాలకు ఏజన్సీలో రహదారులు ఛిద్రమయ్యాయి.


తాడేపల్లిగూడెంలోని పాతూరు ఎస్సీ ఏరియాలో నిలిచిన నీరు

తాడేపల్లిగూడెం 14 (ఆంధ్రజ్యోతి) : తాడేపల్లిగూడెంలో పట్టణంలో 162.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లా అత్యధికంగా తణుకులో 236.6 మిల్లీమీటర్లు, ఇరగవరంలో 196.6 మిల్లీమీటర్లు, పెనుగొండ 193.8 మిల్లీమీటర్లు వర్షం కురిసింది. అత్యల్పంగా మొగల్తూరులో 8.8 మిల్లీమీటర్లు నమోదైంది. జిల్లా వ్యాప్తంగా నిన్న ఒక్కరోజునే సగటు వర్షపాతం 90 మిల్లీమీటర్లు నమోదైనట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. తాడేపల్లిగూడెం పట్టణానికి ఆనుకుని తాళ్లముదునూరుపాడు, యాగర్లపల్లి, కడకట్ల ప్రాంతాల్లోని వరిపొలాలు నీటమునిగాయి. యాగర్లపల్లి, వీకర్స్‌కాలనీ, పాతూరులోని ఎస్‌సీ ఏరియాలోని కొన్ని ప్రాంతాల్లోని వీధుల్లో ఇంకా నీరు వెళ్లే మార్గంలేక డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నాయి. పాతూరులోని తాడేపల్లిచెరువు వద్ద డ్రైనేజ్ పొంగిపొర్లి నీరు పోయే మార్గంలేక వీధుల్లోకి నీరు చేరింది. జేసీబీ సహా యంతో డ్రైనేజ్‌లో పేరుకుపోయిన చెత్త తొలగించినట్టు మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు తెలిపారు.

వయ్యేరు రెగ్యులేటర్ గేట్లు ఎత్తివేత

తణుకు రూరల్ : తణుకు మండంలోని మండపాక, ఎర్రనీలి గుంట, దువ్వ, కొమరవరం, తేతలి గ్రామాలోని పల్లపు పొలాల్లోని వరి పంట నీట మునిగింది. తణుకు మండలం మండపాక, వరిగేడు సరిహద్దులోని పంట కాలువ గట్టు మట్టి మాఫియా తవ్వేయడంతో రాత్రి కురిసిన భారీ వర్షానికి నీటి ప్రవాహం పెరగడంతో గట్లపై బడి మురుగునీరు ప్రవహించి పంటచేలను ముంచెత్తిందని రైతులు చెబు తున్నారు. కాలువ గట్లను పటిష్టం చేయాలని రైతులు కోరుతున్నారు. ఎర్రకాలువ వరద నీటిని కిందికి పోయే విధంగా తణుకు మండలం దువ్వ వయ్యేరు రెగ్యులేటర్ వద్ద గేట్లను ఎత్తివేశారు.



మండపాకలో పంటకాలువ గట్లపై ప్రవహిస్తున్న నీరు... దువ్వలో నీట మునిగిన పంట పొలాలు


పెనుగొండలో మునిగిన చేలు

ఉధృతంగా నక్కల కాలువ

పెనుగొండ : పెనుగొండ మండలంలోని పలు గ్రామాల్లో వరి నారుమడులు చెరువులను తలపించాయి. చేలల్లోని నీరు ఎటూ పారకపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. పంట కాలువలు పొంగి పొర్లుతున్నాయి. పంట కాలువ, చేలు కలిసిపోయి చెరువులను తలపిస్తున్నాయి. పెనుగొండలో నక్కల కాలువ ఉధృతంగా ప్రవహిస్తున్నది.

నేలకొరిగిన భారీ వృక్షాలు

ఆకివీడు : ఈదురు గాలులకు బుధవారం అర్థరాత్రి రెండు భారీ వృక్షాలు నేలకొరిగాయి. ఆకివీడు సాలిపేట పెద్దవీధిలో వేపచెట్టు విరిగిపడింది. అందేవారి బోదె గట్టుపై భారీ రావిచెట్టు విద్యుత్ తీగలపై పడింది. విద్యుత్ అధికారులు మరమ్మత్తులు చేసి కరంటు పునరిద్ధరించారు. మండలంలో 194 ఎకరాలు, పట్టణ పరిధిలో 65 ఎకరాలు నీట మునిగినట్లు అధికారులు చెపుతున్నారు.


ఇరగవరంలో చెరువులా వరి పొలాలు

ముంపులో పొలాలు.. రైతుల కలవరం

పెంటపాడు/ ఇరగవరం/గణపవరం /పాలకోడేరు/ ఉండి : పెంటపాడు మండలంలోని కే.పెంటపాడు, యానాలపల్లి, పరిమెళ్ళ, బోడపాడు , రావిపాడు తదితర గ్రామాలలో వరిచేలు నీట మునిగాయి. బోడపాడు లో లెవిల్ కాలువకు గండి పడటంతో రావిపాడులో కొన్ని పొలాలు ముంపునకు గురయ్యాయి. తహసీల్దార్ రాజరాజేశ్వరి, ఏవో చీర్ల రవికుమార్‌లు పొలాలను పరిశీలించారు. వర్షాలు ఇంకా కురిస్తే నాట్లు కుళ్ళి పోయే ప్రమాదం ఉందని పెంటపాడుకు చెందిన రైతు వీతల సత్యనారాయణ ఆందోళన వ్యక్తం చేశాడు. ఇరగవరం మండలంలో 3,200 ఎకరాల్లో పంట మునిగినట్టు వ్యవసాయాధికారి రాఘవేంద్రరావు వెల్లడించారు. కావలిపురం, ఇరగవరం, అర్జునుడుపాలెం, రేలంగి గ్రామాలలోని వరి చేలు చెరువులుగా మారాయి. నీటిని బయటకు పంపేందుకు నానా అవస్థలు పడ్డారు. గణపవరం మండలంలోని 25 గ్రామాలకు గాను 14 గ్రామాల్లో వరిపొలాలు ముంపునకు గురయ్యాయి. ముంపు పొలాలను మండల వ్యవసాయాధికారులు పరిశీలించారు. మరో రెండురోజులు వర్షాలు రాకుండా ఉండాలని రైతులు ఆకాశం వైపు చూస్తూ వరుణదేవున్ని ప్రార్థిస్తున్నారు. పాలకోడేరు మండలం మోగల్లు శివారు గుత్తులవారిపాలెంలో గోస్తనీనది పొంగి పొలాల్లోకి నీరు ఎగదన్నడంతో పొలాలు మునిగాయి. ప్రతి ఏటా ఈ గ్రామాన్ని చేర్చి ఉన్న గోస్తనీ నది పొంగుతూ ఉండటంతో ఏదో ఒకచోట గండిపడుతూనే ఉంటుంది. ఈ ఏడాది కూడా గోస్తనీ నది పొంగిపొర్లడంతో ఆ ప్రాంత రైతులు ఒక్కసారిగా కంగారుపడి పంట పొలాల్లోకి వెళ్ళే తూములను కట్టేసుకున్నారు.

లోతట్టు ప్రాంతాలు జలమయం

పోలవరం /ఉంగుటూరు/భీమడోలు : పోలవరంలో గురువారం సాయంత్రం భారీ వర్షం కురిసింది.వర్షానికి గూటాల, కొత్తపట్టిసీమ, పట్టిసీమ, పోలవరం పంచాయతీలలో ఏటి గట్టుకి దిగువన ఉన్న పల్లపు


పోలవరంలో గురువారం జోరు వాన

ప్రాంతాలు మేజర్ డ్రైనేజీలు లేక జలమయ మయ్యాయి. ఉంగుటూరు మండలంలో లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. ఏలూరు కాల్వ నీటి మట్టం ప్రమాదస్థాయిలో ప్రవహిస్తున్నది. భీమడోలు మండలంలో భీమడోలు, పూళ్ళ, గుండుగొలను తదితర గ్రామాల్లో భారీ వర్షానికి డ్రైనేజీలు పొంగి పొర్లాయి. మండల వ్యాప్తంగా 350 ఎకరాల్లో వరి సాగు నీట మునిగాయి. గురువారం వర్షం లేకపోవడంతో రైతులు ఊరిపి పీల్చుకున్నారు. ప్రస్తుతం వరికి ఇబ్బంది లేదని ఏవో ఉషారాణి తెలిపారు.


వంకవారిగూడెం వద్ద కొట్టుకుపోయిన ఆర్అండ్‌బీ రహదారి

కొట్టుకుపోయిన రహదారులు

జీలుగుమిల్లి/ టి.నరసాపురం : కుండపోతగా కురిసిన వర్షంతో గిరిజన ప్రాంతంలో చెరువుల్లో జలకళ కన్పిస్తోంది. బుధవారం రాత్రి కురిసిన వర్షాలకు పల్లపు ప్రాంతాల్లో చిన్న చిన్న ఆయకట్టు చెరువులు నిండాయి. దీంతో మెట్ట ప్రాంతంలో వర్షాధారంగా వేసే వరినాట్లు ఊపందుకున్నాయి. తెలంగాణ నుంచి వచ్చే అశ్వారావుపేటవాగు పొంగి ప్రవహించటంతో వంకవారిగూడెం సమీప వాగు వద్ద ఆర్అండ్‌బీ రహదారికి గండిపడింది. దీంతో సమీప గిరిజన గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి వచ్చే వీలు లేక ఇబ్బందులు పడుతున్నారు. రాచన్నగూడెం, జిల్లేళ్ళగూడెం, బొత్తప్ప గూడెం, మడకం వారిగూడెం, కొత్తపండువారిగూడెం, చీమలవారిగూడెం ప్రాంతాల్లో గిరిజన గ్రామాల్ని కలిపే రహదారులు వరదనీటి ఉధృతికి కొట్టుకుపోయాయి. టి.నరసాపురం మండలం ముగ్గురాల వాగు పొంగి ప్రవహిస్తోంది. బండివారిగూడెం, మక్కినవారిగూడెం గ్రామాల మధ్య టి.నర్సాపురం, మక్కినవారిగూడెం గ్రామాల మధ్య దుర్గమ్మగుడి వద్ద ముగ్గురాలవాగు పొంగి ప్రవహిస్తుండటంతో ఆ మార్గంలో వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. తహసీల్దార్ సాయిబాబా, హెడ్‌కానిస్టేబుల్ రాజు, రెవెన్యూ సిబ్బంది వాగును పరిశీలించారు.


ముగ్గురాల వాగు పరిశీలిస్తున్న తహసీల్దార్

మొగల్తూరులో సార్వా ఊడ్పులు

మొగల్తూరు: మొగల్తూరు మండలంలో బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకూ 16.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఈ ఏడాది వర్షాలు ఆలస్యంగా కురవడం, సాగునీరు సక్రమంగా అందకపోవడంతో ఆలస్యమైన సార్వా పనులు రెండు రోజులుగా ఊపందుకున్నాయి. ప్రతీ ఏటా మండలంలో సుమారు 2 వేల ఎకరాలు పైబడి వరిసాగు చేసే రైతులు ఈఏడాది మొగల్తూరు, రామన్నపాలెం పంచాయతీ అడవిపర్ర, శేరేపాలెం, కొత్తపాలెం గ్రామాల్లో 690 ఎకరాల్లో మాత్రమే సాగు చేపడుతున్నట్టు మండల వ్యవసాయాధికారి అబ్దుల్ రహీమ్ పేర్కొన్నారు.మండలంలోని గొంతేరు, వెస్ట్‌కుక్కులేరు, ఈస్ట్ కుక్కులేరు, దర్భరేవు డ్రెయిన్‌లు పొంగిపొర్లుతున్నాయి.



బీచ్‌కు రావద్దు



మొగల్తూరు : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో రాబోయే మరో నాలుగు రోజులు పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున పేరుపాలెం బీచ్‌కు పర్యాటకులకు అనుమతించడం లేదని ఎస్ఐ జి.వాసు ఒక ప్రకటనలో తెలి పారు. సముద్ర అలలు ఎగసిపడే అవకాశం ఉన్నందున పర్యాటకులను అనుమతించడం లేదని తదుపరి ఉత్తర్వులు జారీ చేసే వరకూ రావద్దని ఎస్ఐ సూచించారు.

విజిలెన్స్ ఎస్ఐ సీతారామ్‌కు ఇండియన్ పోలీస్ మెడల్



ఏలూరు క్రైం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంలో ఎస్ఐగా పనిచేస్తున్న కరిమికొండ సీతారామ్‌కు కేంద్ర ప్రభుత్వం ఇండియన్ పోలీస్ మెడల్ అవార్డును ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వం గురువారం విడుదల చేసిన పోలీస్ మెడల్, ప్రెసిడెంట్ మెడల్ అవార్డులలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఎస్ఐ సీతారాము ఒక్కరే ఉన్నారు. బుట్టాయిగూడేనికి చెందిన దుర్గారావు, నాగమణి దంపతుల కుమారుడైన సీతారామ్ 1984 జనవరి 13న కానిస్టేబుల్‌గా పోలీస్‌శాఖలో చేరారు. 2019 జూన్ 3న ఎస్ఐగా పదోన్నతి లభించింది. జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో పనిచేశారు. పెరవలి పోలీస్ స్టేషన్ పరిధిలో హత్య చేసి సొత్తు ఎత్తుకుపోయిన కేసు, 70 లక్షల విలువైన గంజాయి కేసు గుర్తించడం, అమాయక ప్రజలను మోసగించిన కేసులను ఛేదించడంలో ఉన్నతాధికారుల నుంచి ప్రశంసలు అందుకున్నారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంలో పనిచేస్తూ ఆహారం కల్తీ కేసుల్లో నూనెలు, టీపొడి, బాదంపొడి, నెయ్యి, బెల్లం తయారీలో కల్తీ వస్తువులను సుమారు 5.76 కోట్ల విలువైన వాటిని సీజ్ చేయించగలిగారు. ఇప్పటి వరకూ ఆయనకు 157 నగదు బహుమతులు, 12 గుడ్ సర్వీసు ఎంట్రీలు, ఒక ప్రశంసాపత్రం, సేవా పతకం, ఉత్తమ పతకం, అతిఉత్కృష్ట సేవా పతకం అందుకున్నారు. ప్రస్తుతం ఆయన చేస్తున్న సేవలకు కేంద్ర ప్రభుత్వం గుర్తించి స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని ఇండియన్ పోలీస్ మెడల్‌ను ప్రకటించింది. విజిలెన్సు ఇన్‌ఛార్జి ఎస్పీ మహేష్, డీఎస్పీ వెంకటేశ్వరరావు, సీఐలు శివరామకృష్ణ, ప్రసాదకుమార్ అభినందించారు.

సీబీఐ అధికారి బండి పెద్దిరాజుకు రాష్ట్రపతి పతకం



పాలకోడేరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) :పాలకోడేరు మండలం శృంగవృక్షం గ్రామ పంచాయతీ పరిధిలోని బంటుమిల్లి గ్రామానికి చెందిన సీబీఐ అధికారి బండి పెద్దిరాజు రాష్ట్రపతి పోలీసు పతకానికి ఎన్నికయ్యారు. ప్రస్తుతం ఆయన న్యూఢిల్లీ కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) ప్రధాన కార్యాలయం సైబర్ క్రైం ఇన్వెస్టిగేషన్ డివిజన్‌లో అదనపు పోలీసు సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తు న్నారు. 2025 స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విశిష్ట సేవకు రాష్ట్రపతి పోలీసు పతకం లభించింది. పోలీసు దళం లేదా కేంద్ర పోలీసు, భద్రతా సంస్థలలో అసాధారణమైన సేవా రికార్డును ప్రదర్శించే వ్యక్తులకు ఈ పతకం ఇస్తారు. 1993లో సీబీఐలో కానిస్టేబుల్‌గా చేరారు. ఇప్పటి వరకు ఆయన 150 పైబడి రివార్డ్స్ అందుకున్నారు. స్వగ్రామమైన బంటుమిల్లిలో విద్యా ట్రస్ట్ పేరుతో సేవలందిస్తున్నారు. 32 ఏళ్ళ సర్వీసులో పెద్దిరాజు 1997లో ఎస్ఐ, 2003లో ఇన్‌స్పెక్టర్, 2016లో డిప్యూటీ ఎస్పీ, 2023లో అడిషనల్ ఎస్పీ అయ్యారు.ఇటీవల ఆయన నీట్ యూజీ 2024 ప్రశ్నాపత్రం లీకేజ్ కేసులో చీఫ్ ఇన్వెస్టిగేటింగ్ ఆఫీసర్‌గా పని చేశారు. అక్కడ ఆయన ప్రయత్నాలు 45 మంది నిందితులను అరెస్ట్ చేయడానికి, సమగ్ర చార్జిషీట్‌లను దాఖలు చేయడానికి దారితీశాయి. ఆయన్ని రాష్ట్రపతి పోలీస్ పతకం వరించడంతో బంటుమిల్లి గ్రామస్తులు అభినందించారు.



ఏపీ నిట్‌లో హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో పాల్గొన్న ఆచార్యులు, విద్యార్థులు

ప్రతి ఒక్కరూ దేశ భక్తిని అలవర్చుకోవాలి

తాడేపల్లిగూడెం అర్బన్, ఆగస్టు (ఆంధ్రజ్యోతి) :ప్రతీ ఒక్కరూ దేశ భక్తిని అలవర్చుకోవాలని ఏపీ నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్‌రెడ్డి అన్నారు. గురువారం ఏపీ నిట్‌లో హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించి భారత్‌మాతాకు జై అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా దినేష్ శంకర్‌రెడ్డి మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలర్పించిన అమరవీరులను స్మరించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ప్రతీ ఒక్కరూ తమ ఇళ్లపై జాతీయ జెండాలను ఎగుర వేయాలన్నారు. కార్యక్రమానికి కో ఆర్డినేటర్‌గా అసోసియేట్ డీన్ డాక్టర్ శ్రీనివాసన్ వ్యవహరించగా ఆచార్యులు డాక్టర్ రాజేశ్వరరెడ్డి, డాక్టర్ సునీల్, సాస్ అసిస్టెంట్లు సంధ్య, సాయిరాం పాల్గొన్నారు



ద్వారకాతిరుమల విర్డ్ ఆసుపత్రిలో దివ్యాంగులకు కాలిపర్స్ పంపిణీ చేస్తున్న ఈవో మూర్తి, ఎస్‌బీఐ ఆర్ఎం కాళిదాసు

విర్డ్ ఆసుపత్రి సేవలు భేష్

ద్వారకాతిరుమల, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ద్వారకా తిరుమల విర్డ్ ఆసుపత్రి ద్వారా రోగులకు అందుతున్న సేవలు ప్రసంశనీయమని శ్రీవారి దేవస్థానం ఈవో ఎన్వీ సత్యన్నారాయణమూర్తి అన్నారు. విర్డ్ ఆసుపత్రిని గురువారం ఆయన, ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ కాళిదాసులు పరిశీలించారు. వైద్యసేవలు, రోగులకు అందుతున్న సేవలు, సదుపాయాలు, పరిసరాల పరిశుభ్రత మెరుగ్గా ఉందని కితాబిచ్చారు. అనంతరం గుప్తా సహకారంతో తయారైన కాలిపర్స్‌ను పలువురికి అందజేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి యాజమాన్యం, వైద్యులు భవ్యచంద్, హమీద్, బాలాజీ, విహారి, నాగేంద్ర బాబు, సింధు తదితరులు పాల్గొన్నారు.

మావుళ్లమ్మ ధర్మకర్తల మండలికి నోటిఫికేషన్

భీమవరం టౌన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : మావుళ్ళమ్మ ఆలయ ధర్మకర్తల మండలి నియామకానికి దేవదాయ ధర్మాదాయ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. భీమవరం పట్టణంలో ఉన్న మావుళ్ళమ్మ దేవస్థానం పాలకమండలి సభ్యులను నియమించేందుకు హిందూ మతానికి చెందిన 13 మందిని ధర్మకర్తల మండలి సభ్యులుగా నియమిస్తారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు వారి దరఖాస్తులను ఆలయ కార్యాలయంలో అందజేయవచ్చు. వివరాలకు దేవస్థానం కార్యాలయ పనివేళల్లో సంప్రదించవచ్చని ఆలయ ఈవో బుద్ధ మహాలక్ష్మీ నగేష్ తెలిపారు. శ్రావణ మాసం శుక్రవారం పురస్కరించుకుని ఆలయంలో శుక్రవారం ఉదయం 8 గంటలకు సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అమ్మవారిని దర్శించుకున్న మానవ హక్కుల సంఘం చైర్మన్ దంపతులు



మావుళ్ళమ్మ అమ్మవారిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మానవహక్కుల సంఘం చైర్మన్ వెంకట రమణ దంపతులు దర్శించుకున్నారు. వారికి అర్చకులు అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అర్చకులు కొడమంచిలి కొప్పేశ్వరరావు ఆశీర్వచనాలు అందించారు. దేవస్థానం తరుఫున ఈవో శేషవస్త్రం, ప్రసాదాలు అందించారు.



గిట్టుబాటు ధరలు లేక తమ బేళ్లను వెనక్కి తీసుకువెళ్తున్న రైతులు

గత ఏడాది ఆశాజనకంగా ఉన్న పొగాకు ధరలు ఈ ఏడాది రివర్స్ విధానంలో కొనసాగుతున్నాయి. మార్చిలో రూ.290 తో ప్రారంభమైన పొగాకు ధరలు జూలై చివరిలో రూ.390 వరకు పెరిగింది. రూ. వంద పెరగడానికి నాలుగు నెలలు పడితే నెల రోజుల్లోగానే రెండు సార్లు రూ.40 తగ్గింది. గత నెల 26వ తేదీ శనివారం రూ.390 నుంచి రూ.370 కు పడిపోగా, ఈ నెల తొమ్మిదో తేదీ శనివారం రూ.370 నుంచి 350 కి పడిపోయింది. ధరలిలా తగ్గిపోతుంటే వచ్చే ఏడాది పంట పండించేందుకు రైతులెవరూ ముందుకు రారని రైతు సంఘ నాయకులు అంటున్నారు. ప్రభుత్వం పట్టించుకోకుంటే చేసిన అప్పులు తీర్చలేక, కౌలు చెల్లించలేక వారికి ఆత్మహత్యలే శరణ్యమని వాపోతున్నారు.

పొగాకు పండించలేం..

- వారం వారం ధరలు తగ్గిస్తున్న వైనం
- కంపెనీలు సిండికేట్?
- ప్రభుత్వం పట్టించుకోకుంటే ఆత్మహత్యలే శరణ్యమంటున్న రైతులు



వేలం కేంద్రం వద్ద వేలంలో పాల్గొన్న పొగాకు కంపెనీల ప్రతినిధులు

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): వర్జీనియా పొగాకు ధరలను మునుపెన్నడూ లేని విధంగా పొగాకు కొనుగోలు కంపెనీలు సిండికేట్ అయి తగ్గించేశాయని పొగాకు రైతులు ఆరోపిస్తున్నారు. ప్రతి శనివారం కిలో పొగాకుకు రూ.20 తగ్గిస్తూ తమ ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తగ్గిన కంపెనీల ప్రాతినిధ్యం

వేలం ప్రారంభంలో 35 నుంచి 40 కంపెనీలు వేలంలో పాల్గొనగా ప్రస్తుతం పది కంటే తక్కువ కంపెనీలు మాత్రమే పొగాకు కొనుగోలు చేస్తున్నాయి. నూటికి 90 శాతం కంపెనీలు మేలు రకం పొగాకును మాత్రమే కొనుగోలు చేస్తుండగా అతి తక్కువ కంపెనీలు మాత్రమే ప్రథమ, ద్వితీయ, తృతీయ శ్రేణి పొగాకును కొనుగోలు చేస్తున్నాయి. గత నెలలో క్వాలిటీ పొగాకు ధర రూ.390 ఉండగా బుధవారం అదే పొగాకు ధర రూ.340కు పడిపోయింది. దీంతో క్వాలిటీ పొగాకును తక్కువ ధరకు అమ్మడం ఇష్టం లేక చాలా మంది రైతులు తమ బేళ్లను వెనక్కి తీసుకుపోయారు. లో-గ్రేడు పొగాకు ధర రూ.200కు మించడం లేదు.

అదనంగా పండించారన్న సాకుతో..

రైతులు అదనంగా పండించిన పొగాకును గత ఏడాది ఎటువంటి పెనాల్టీ లేకుండా కొనుగోలు చేసేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. దీంతో రైతులకు ఊరట కలిగింది. ఈ ఏడాది కూడా రైతులు పొగాకు పంటను అదనంగా పండించారు. ప్రభుత్వం ఇప్పటివరకు అదనపు పంట కొనుగోలుపై ఎటువంటి సంకేతాలు ఇవ్వలేదు. ఇదే అదనుగా భావించిన కంపెనీలు ధరలు తగ్గించేస్తున్నాయి. ఎంత తక్కువ ధర ఉన్నా తప్పనిసరిగా రైతులు పొగాకును అమ్ముకోవాల్సిందేనని, వేరే దారి లేదనే ఉద్దేశ్యంతో కంపెనీలు ఉన్నాయి. ఆ ఉద్దేశ్యంతోనే ప్రతి శనివారం రూ.20 తగ్గించుకుంటూ చివరికి రూ.300 వరకు స్థిరంగా ఉంచుతాయనే సంకేతాలు రైతులకు పంపుతున్నారు. ఇంత జరుగుతున్నా ప్రభుత్వాలు రైతుల గోడును పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. విదేశాల నుంచి సరైన ఆర్డర్లు రాకపోవడంతోనే పొగాకును కొనుగోలు చేయడానికి కంపెనీలు ఆసక్తి చూపించడంలేదని కంపెనీల ప్రతినిధులు రైతులకు చెబుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. ప్రస్తుతం పొగాకు కొనుగోలు చేసే కంపెనీలు చివరి వరకూ ఉంటాయా లేదా అనే సందేహం రైతుల్లో నెలకొంది. కొంచెం కొంచెంగా ధరలు పతనం చేయడానికి కంపెనీలు పూనుకున్నాయని రైతులు మనోవేదనకు గురవుతున్నారు. ప్రభుత్వం, పొగాకు బోర్డు అధికారులు వెంటనే స్పందించి గిట్టుబాటు ధరలు కల్పించకపోతే తాము తీవ్ర నష్టాల్లో కూరుకుపోయే పరిస్థితి నెలకొంటుందని రైతులు వాపోతున్నారు.

ఆత్మహత్యలే శరణ్యం



కంపెనీలన్నీ సిండికేట్ అయ్యాయి. ప్రతి శనివారం రూ. 20 తగ్గిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న క్వాలిటీ పొగాకు ధరను ఇంకా తగ్గించడానికి కంపెనీలు ప్రయత్నిస్తున్నాయి. మార్చి నెలలో వేలం ప్రారంభమైనా ఇప్పటికీ తమ వద్ద ఉన్న లో-గ్రేడు పొగాకును కంపెనీలు కొనడంలేదు. క్వాలిటీ పొగాకు ధరలు కూడా వారం తగ్గిపోతున్నాయి. ఈ ధరలు ఇలాగే కొనసాగితే వచ్చే ఏడాది వ్యవసాయం చేసే పరిస్థితి లేదు. ప్రభుత్వం స్పందించి గిట్టుబాటు ధరలు కల్పించాలి. లేదంటే ఆత్మహత్యలే శరణ్యం.

-పెండ్యాల రాజేంద్ర ప్రసాద్, రైతు సంఘ నాయకుడు, మధ్యాహ్నపువారిగూడెం

ప్రత్యేక రైళ్ల పొడిగింపు

ఏలూరు క్రైం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా మీదుగా నడుస్తున్న రెండు ప్రత్యేక రైళ్ళను పొడిగిస్తున్నట్లు విజయవాడ దక్షిణ మధ్య రైల్వే శాఖాధికారులు ప్రకటించారు. రైల్ నంబర్ 07031 చర్లపల్లి నుంచి కాకినాడ టౌన్‌కు ప్రతి శుక్రవారం రాత్రి 7.30 గంటలకు చర్లపల్లిలో బయలుదేరి మరుసటిరోజు ఉదయం 9 గంటలకు కాకినాడ టౌన్‌కు చేరుకుంటుంది. ఈ రైలు ఆగస్టు 15, 22, 29 తేదీల్లో నడుస్తుంది. రైల్ నంబర్ 07032 కాకినాడ టౌన్ నుంచి చర్లపల్లి ప్రతి ఆదివారం రాత్రి 8.10 గంటలకు కాకినాడ టౌన్‌లో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 8.30 గంటలకు చర్లపల్లి చేరుకుంటుంది. ఈ రైలు ఆగస్టు 17, 24, 31 తేదీల్లో నడపనున్నారు. ఈ రెండు రైళ్ళు నల్గొండ, మిర్యాలగూడ, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, గుడివాడ, కైకలూరు, ఆకివీడు, భీమవరం టౌన్, తణుకు, రాజమండ్రి, సామర్లకోట స్టేషన్లలో ఆగనున్నాయి. ఈ రైళ్ళల్లో టూ టైర్ ఏసీ, త్రీ టైర్ ఎసీ, స్లీపర్, జనరల్, సెకండ్ క్లాస్ కోచ్‌లు ఉంటాయని అధికారులు తెలిపారు.



అవగాహన పోస్టర్లను ప్రదర్శించి ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

డ్రగ్స్ రహిత సమాజం అందరికీ క్షేమం

భీమవరం క్రైం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ రహిత సమాజం మనందరికి క్షేమమని, క్షణికంగా అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎక్సైజ్ సీఐ బలరామరాజు అన్నారు. ఈగల్ శాఖ ఆధ్వర్యంలో గురువారం భీమవరం ఎక్సైజ్ కార్యాలయం వద్ద మాదక ద్రవ్యాల నిషేధంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఐ బలరామరాజు మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం యువతపై తీవ్ర ప్రభావం చూపుతుందని, గంజాయి రవాణా, వినియోగం, ఇతర మత్తు పదార్థాలపై ఉక్కుపాదం మోపామని అన్నారు. ఈగల్ సభ్యులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ రైల్వే, ఆర్టీసీ బస్సుల్లో మాదకద్రవ్యాల నియంత్రణకు సంబంధించి అవగాహన పోస్టర్లను పెట్టాలన్నారు. ఆధునిక పరిజ్ఞానంతో మాదకద్రవ్యాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం ప్రతిజ్ఞ ర్యాలీ నిర్వహించారు. ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు.

సారా కేసులో ఒకరికి రిమాండ్

చింతలపూడి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): నాగిరెడ్డిగూడెం గ్రామంలో సారా కేసులో పలు సార్లు పట్టుబడిన వడిత్యా రామదాసును అరెస్టు చేసి కోర్టుకు హాజరుపర్చగా రిమాండ్ విధించడంతో అతడిని రాజమహేంద్రవరం జైలుకు తరలించినట్టు ఎక్సైజ్ సీఐ పి.అశోక్ తెలిపారు. ఎక్సైజ్ స్టేషన్‌లో తాను లేని సమయంలో నిందితుడు రాందాసు భార్య, మరో ఐదుగురు కార్యాలయంపై దాడి చేశారన్నారు. ఫర్నీచర్‌ను ధ్వంసం చేసి మహిళా కానిస్టేబుల్‌పై చెయ్యి చేసుకున్నారని, ఈ ఆరుగురిపై దాడి కేసు నమోదైందని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

పెదపాడు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ముందు వెళుతున్న టాటాఏస్ ఆటో సడన్ బ్రేక్ వేయడంతో వెనుక వస్తున్న మోటారు సైకిలిస్ట్ ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. బొమ్ములూరుకు చెందిన మట్టా నాంచారయ్య మోటారు సైకిల్‌పై ఏలూరు వైపు మరోవ్యక్తితో కలిసి వెళుతుండగా టోల్‌గేట్ వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. గాయపడిన నాంచారయ్యను చికిత్స నిమిత్తం విజయవాడ తరలించారు. మరో కేసులో విజయవాడ శ్రీనివాసనగర్‌కు చెందిన కొండపల్లి మంగరాజు తన భార్య, కుమారుడితో కలిసి గురవాయిగూడెంలోని పెదకుమారుని ఇంటికి వెళుతుండగా ముందు వెళుతున్న టాటాఏస్ ట్రక్కు డ్రైవర్ సడన్‌గా యుటర్న్ చేయడంతో వెనుక నుంచి వచ్చి ఢీకొన్నాడు.గాయపడిన మంగరాజును చికిత్స నిమిత్తం విజయవాడ తరలించారు. పెదపాడు ఎస్.ఐ. కట్టా శారదా సతీష్, ఏఎస్సై గజపతిరావులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఒంటరితనాన్ని భరించలేక వ్యక్తి ఆత్మహత్య

టి.నర్సాపురం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఒంటరితనాన్ని భరించలేక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని కె.జగ్గవరంలో గురువారం చోటు చేసుకుంది. మండలంలోని కె.జగ్గవరం గ్రామానికి చెందిన బర్రే రాజేశ్(35) పదేళ్ల క్రితం తన పెద్దక్క కుమార్తెను వివాహం చేసుకున్నాడు. పెళ్లి అయిన నెలరోజులకే ఆమె వెళ్లిపోయింది. ఈ నేపద్యంలో రాజేశ్ తల్లి వద్ద ఉంటున్నాడు. అతనికి చిన్నప్పటి నుంచి కొంచెం మతిస్థిమితం సరిగా లేకపోవడంతో అప్పుడప్పుడు మూర్ఛవచ్చేదని ఒంటరి జీవితాన్ని భరించలేక ఈ నెల 13న విషం తాగడంతో స్థానికులు గుర్తించి చింతలపూడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. రాజేశ్ సోదరుడు ఏలియా ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

ముదినేపల్లి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి-గుడివాడ రహదారిలో కల్వపూడి సత్రం సమీపంలో ఈ నెల 4వ తేదీ రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో తీవ్ర గాయాలకు గురైన వడాలికి చెందిన నూలు వెంకట వరలక్ష్మి(55) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ప్రమాదానికి గురైన ఈ మహిళను గుడివాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించగా, మెరుగైన వైద్యం కోసం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం మృతి చెందినట్టు ఎస్ఐ వీరభద్రరావు తెలిపారు.

డబ్బు తీసుకుని మోసగించిన వ్యక్తిపై కేసు

మొగల్తూరు, ఆగస్టు14(ఆంధ్రజ్యోతి):సింగపూర్‌లో జీవనోపాధి పొందుతున్న తనను నమ్మించి తన వద్ద ఉన్న డబ్బును అప్పుగా తీసుకున్న వ్యక్తిపై బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు మొగల్తూరు ఎస్ఐ జి.వాసు తెలిపారు. విశాఖలోని హరిలోవ కాలనీకి చెందిన రాయి శాంతి అనే 30 ఏళ్ల యువతి జీవనోపాధికై సింగపూర్ వెళ్లింది. మొగల్తూరు మండలం కొత్తకాయలతిప్పకు చెందిన ఒక వ్యక్తి ఆమెకు పరిచయమై నమ్మించి ఆమె వద్ద ఉన్న డబ్బులు అప్పుగా తీసుకున్నాడు.దీంతో బాధితురాలి కుటుంబ సభ్యులు కొత్తకాయలతిప్ప గ్రామంలోని మోసగించిన వ్యక్తిని అతని కుటుంబ సభ్యులను డబ్బు ఇవ్వమని అడగగా ఆవ్యక్తి కుటుంబ సభ్యులు బాధితురాలు కుటుంబ సభ్యులపై కులం పేరుతో దూషించారన్నారు. దీంతో బాధితురాలు విశాఖలో ఫిర్యాదు చేయగా పోలీసులు జీరో ఎఫ్ఐఆర్‌గా కేసు నమోదు చేసి మొగల్తూరు స్టేషన్‌కు బదిలీ చేశారన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ జి.వాసు తెలిపారు.

గోడ కూలి యువకుడి మృతి



మృతి చెందిన సాయి

ఏలూరు క్రైం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): టిప్ టాప్ షామియానాలో పనిచేసే ఒక యువకుడు శంకుస్థాపన కార్యక్రమం వద్ద వేసిన టెంటును తీయడానికి గోడ ఎక్కగా ఆ గోడ కూలి అతడిపై పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఏలూరులోని టీడీ కాలనీ గట్టు ప్రాంతానికి చెందిన కూనకృష్ణసాయి(23)తంగెళ్లమూడిలోని ప్రసాద్ టిప్‌టాప్ కంపెనీలో పనిచేస్తున్నాడు. తంగెళ్ల మూడి బ్రిడ్జి సమీపంలో ఒక షాపు నిర్మాణం కోసం బుధవారం శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. అక్కడ ప్రసాద్ టెంట్లను తీసుకొచ్చి వేశాడు. తిరిగి వాటిని తీసుకువెళ్ళే నిమిత్తం గురువారం మధ్యాహ్నం 12గంటల ప్రాంతంలో వచ్చి వాటిని విప్పడానికి పక్కనే ఉన్న గోడ ఎక్కాడు. ఆ గోడ నానిపోయి ఉండడంతో అకస్మాత్తుగా పడిపోతుండగా అతను కిందకు దూకేశాడు. అయితే గోడకిందపడటంతో తల పగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై ఏలూరు టూటౌన్ సీఐ కె.అశోక్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తమకు న్యాయం చేయాలంటూ బంధువులు సంఘటనా స్థలంలోనే కొద్దిసేపు ఆందోళన చేశారు.

హుండీల దొంగ దొరికాడు



విలేకరులతో మాట్లాడుతున్న డీఎస్పీ ప్రసాద్

నూజివీడు టౌన్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ఆలయాలు, ప్రార్థనా మందిరాల్లో హుండీ దొంగతనాలు చేస్తున్న అంతర్ జిల్లా దొంగను నూజివీడు సర్కిల్ పోలీసులు అరెస్టు చేశారు. నూజివీడు డీఎస్పీ కేవీవీఎన్వీ ప్రసాద్ వివరాలు ప్రకారం రాత్రి వేళల్లో ఆలయాల్లోకి ప్రవేశించి హుండీ తాళాలు పగల గొట్టి నగదును దొంగలించే ఏలూరుకు చెందిన తాజ్‌ఖాన్ కుమారుడు పఠాన్ సలార్ ఖాన్‌ను గురువారం అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు. చాట్రాయిలోని కొత్త ఆంజనేయ స్వామి గుడి వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా పోలవరం నుంచి చాట్రాయికి మోటార్‌సైకిల్‌పై వస్తున్న సలార్‌ఖాన్ పోలీసులను గమనించి పారిపోవడానికి యత్నించాడు. చాట్రాయి ఎస్ఐ డి.రామకృష్ణ ఆధ్వర్యంలో అదుపులోకి తీసుకుని అతని నుంచి రూ.5,900 నగదు, మోటార్ సైకిల్‌ని స్వాధీనం చేసుకున్నట్టు డీఎస్పీ తెలిపారు. నిందితుడిపై ఇప్పటి వరకు వివిధ జిల్లాల్లో మొత్తం 51 చోరీ కేసులు ఉండగా ఏలూరు జిల్లాలో 25, నెల్లూరు జిల్లాలో 23, ఎన్టీఆర్ జిల్లాలో మూడు కేసులు ఉన్నాయన్నారు. నిందితుడి స్వస్థలం ఏలూరు అయినా ప్రస్తుతం నెల్లూరు జిల్లాలో నివాసం ఉంటున్నట్టు తెలిపారు. నిందితుడిని పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన హెడ్ కానిస్టేబుల్ విజయ్‌భాస్కర్, శ్రీనివాసరావు, కానిస్టేబుల్ బాలాజీ, శ్రీనివాసులను డీఎస్పీ అభినందించారు. నూజివీడు సీఐ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పెదకాపవరంలో ఇంట్లో చోరీ

ఆకివీడు రూరల్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): పెదకాపవరంలోని సత్యానారాయణ పురంలోని ఇందుకూరి సూర్యనారాయణ రాజు నివాసంలో చోరీ జరిగింది. ఆరు కాసుల విలువైన బంగారు ఆభరణాలు దొంగిలించినట్టు గుర్తించారని పోలీసులు తెలిపారు. ఈనెల 13న పిప్పర తమ బంధువులు నివాసానికి వెళ్లి 14న ఉదయం వచ్చే సరికే తలుపు తెరిచి లాకర్ బద్దల కొట్టినట్టు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేయగా క్లూస్ టీమ్ వచ్చి వివరాలు సేకరించారు. సంఘటనా స్థలానికి సీఐ జగదీశ్వరరావు, ఎస్‌లు నాగరాజులు పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ప్రయాణాలకు వెళ్ళేటప్పుడు పోలీసులకు సమాచారం అందించాలని, పహారా కాసి చోరీలు జరగకుండా కాపాడుతామని వారు ప్రజలకు తెలియజేశారు.

అర్జీదారు అనుమతిలేకుండానే ఫిర్యాదుకు ముగింపు!

కుక్కునూరు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): సమస్య పరిష్కారం కోసం అర్జీదారు ప్రభుత్వానికి సమస్య విన్నవిస్తే అది పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వ అధికా రులకు ఉంది. కానీ అర్జీదారు అనుమతి లేకుండానే సమస్య పరిష్కరించినట్టు చూపుతున్నారని ఆరోపణలు వస్తున్నాయి. కుక్కునూరు మండలం పెదరావిగూడెం పంచాయతీలో అధికారుల అనుమతి లేకుండా టోల్ ఫీజు వసూలు చేస్తున్నారని రామకృష్ణ అనే వ్యక్తి జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. పెదరావిగూడెం సర్పంచ్ భర్త, పంచాయతీ గుమస్తా కలిసి అర్జిదారుడైన రామకృష్ణ ఇంటికి వెళ్లి అధికారుల నుంచి ఒత్తిడి వస్తుందని, ఏదో తప్పుజరిగింది ఇక నుంచి అలా జరగదని చెప్పి అర్జిక్లోజ్ చేసినట్టు రామకృష్ణ ఆరోపిస్తున్నాడు. తగిన న్యాయం చేయకుండానే ఇలా చేయడంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్టు రామకృష్ణ గురువారం తెలిపారు. సమస్యకు పరిష్కారం కావాలని డిమాండ్ చేశారు.

రెండు బైక్‌లు ఢీ..

ఒకరికి గాయాలు

మొగల్తూరు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని జెట్టిపాలెం గ్రామంలో ప్రధాన రహదారిపై ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొన్న సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ జి.వాసు తెలిపారు. తూర్పుతాళ్ళు గ్రామానికి చెందిన చెన్నా ప్రగడ కనకప్రసాద్ బైక్‌పై వెళ్తుండగా వెనుక నుంచి వస్తున్న మరో బైక్ ఢీకొంది.ఈ ఘటనలో కనకప్రసాద్ తలకు బలమైన గాయాలవ్వడంతో నరసాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

లోతట్టు ప్రాంతాలను పరిశీలించిన సబ్ కలెక్టర్ వినూత్న



అధికారులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ వినూత్న

నూజివీడు టౌన్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): నూజివీడు మున్సిపల్ పరిధిలోని లోతట్టు ప్రాంతాలను సబ్ కలెక్టర్ వినూత్న గురువారం పరిశీలించారు. పట్టణ పరిధిలోని మొగళ్ళ చెరువు, పెద్ద చెరువు, గొడుగువారి గూడెం, ఆర్ఆర్‌పేట, ఎంప్లాయిస్ కాలనీ, తిరువూరు బస్టాండ్ రోడ్డు, బైపాస్ రోడ్డు ప్రాంతాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ గత ఏడాది భారీ వర్షాల నేపథ్యంలో నెలకొన్న అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ప్రస్తుత పరిస్థితులలో ఎలాంటి నష్టం సంభవించకుండా తగిన ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టామన్నారు. లోతట్టుగా ఉన్న మొగళ్ళ చెరువు, పెద్ద చెరువు ప్రాంతాలను ఇరిగేషన్, మున్సిపల్ అధికారుల బృందంతో కలిసి పరిశీలించినట్లు వివరించారు. 24 గంటలు అధికారుల పర్యవేక్షణ కొనసాగుతుందన్నారు. చెరువుల వద్ద కట్టలు పటిష్టంగా ఉండేందుకు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టినట్లు వివరించారు. ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా కంట్రోల్ రూమ్ వద్ద సిద్ధంగా ఉండే సిబ్బంది సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇరిగేషన్ డీఈ అర్జునరావు, మున్సిపల్ కమిషనర్ వెంకట రామిరెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
ఏలూరు
ఏలూరు, ఉంగుటూరు, దెందులూరు, చింతలపూడి, పోలవరం
10 www.andhrajyothy.com ● శుక్రవారం 15 ఆగస్టు 2025

ఘనంగా శిఖర కుంభాభిషేకం

ఏలూరుకార్పొరేషన్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి):సత్రంపాడులోని స్వయంభూ శ్రీసౌభాగ్యలక్ష్మీ దేవి ఆలయ వార్షికోత్సవం, శిఖర కుంభాభిషేకాలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు ఊటుకూరి నాగేశ్వరశర్మ అమ్మవారికి ప్రత్యేక అలంకారం జరిపి హారతులిచ్చి భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం మహా అన్నప్రసాద వితరణను నిర్వహించారు. ఆలయ చైర్మన్ కె.జి.ఎన్.వి.గోపాలకృష్ణ, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు చినబాబు, నాగభూషణం, ప్రవీణ్, సావిత్రమ్మ, పోతురాజు, జి.ఎస్.ఎన్.కె.శ్రీనివాసరావు బృందం భక్తులకు సేవలందించారు.

ఏలూరులో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

ఏలూరుటూటౌన్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల కారణంగా ప్రజలు ఎటువంటి ఇబ్బందులు పడకుండా నగరంలో కమండ్ కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేసినట్లు నగరపాలక సంస్థ కమిషనర్ భానుప్రతాప్ తెలిపారు. రాత్రి 10నుంచి ఉదయం 6గంటల వరకు సిబ్బంది కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ఉంటారన్నారు. ప్రజల నుంచి వచ్చే కాల్స్‌ను స్వీకరించి సంబంధిత అధికారులతో కలిసి సమస్య పరిష్కరించడానికి కృషి చేస్తారన్నారు. టోల్‌ఫ్రీ నెంబర్లు 08812222200, 08812232101కు ఫోన్ చేయాలన్నారు.

కళావేదిక జాతీయ ప్రధాన ప్రణాళికాధికారిగా పార్థసారథి



ఏలూరురూరల్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి):అతి పెద్ద సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థగా కళావేదిక వర్ధిల్లుతున్న సంగతి తెలిసిందే.. అయితే ఈ కళావేదిక జాతీయ ప్రధాన కార్యదర్శి డా.టి.పార్థసారథిని జాతీయ ప్రధాన ప్రణాళికాధికారిగా నియమించారు. ఈసందర్భంగా పార్థసారథి మాట్లాడుతూ తమకు మరింత బాధ్యత పెరిగిందని కళావేదిక నిరంతరం నిర్వహించే సాహిత్య, సాంస్కృతిక, సామాజిక కార్యక్రమాల విస్తరణలో భాగస్వామిగా శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని అన్నారు.

పోలీస్ విశిష్ట సేవా పతకానికి సత్యనారాయణ ఎంపిక



దెందులూరు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల పరిరక్షణ, చట్టాలను సక్రమంగా అమలు చేస్తున్నందుకు అందిస్తున్న పోలీస్ విశిష్ట సేవా పురస్కారానికి హెడ్‌కానిస్టేబుల్ సత్యనారాయణ ఎంపికయ్యారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం దెందులూరు పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న సత్యనారాయణకు కలెక్టర్, ఎస్పీ చేతుల మీదుగా పతకాన్ని అందించనున్నారు.

రేపు నిర్వాసిత కాలనీల్లో బృందం పర్యటన

బుట్టాయగూడెం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలు క్షేత్రస్థాయిలో తెలుసుకునేందుకు ఈ నెల 16న ఏజెన్సీకి వస్తున్న ఎంపీ జాన్ బ్రిట్టాస్, సీపీఎం ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబిల పర్యటనను జయప్రదం చేయాలని నాయకులు కోరారు. గురువారం బుట్టాయగూడెంలో జరిగిన సమావేశంలో నాయకులు పాల్గొని మాట్లాడుతూ నిర్వాసితుల కాలనీలు, గిరిజనుల సాగులో ఉన్న భూములను పరిశీలిస్తారని అన్నారు. వీరితో పాటు రాష్ట్ర నాయకులు బి.బలరాం, బి.తులసీదాసు జిల్లా నాయకులు పర్యటనలో పాల్గొంటారని తెలిపారు. నాయకులు తెల్లం రామకృష్ణ, పోలోజు నాగేశ్వరావు, తామా ముత్యాలమ్మ, ఉడతా వెంకటేశ్వరావు, కురసం భీమరాజు, మడకం శ్రీదేవి, వెట్టి వీరయ్య, తెల్లం వెంకటలక్ష్మీ పాల్గొన్నారు.

ముగిసిన ఉపవాస ప్రార్థనలు

దెందులూరు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): 50 రోజులుగా రాష్ట్ర స్థాయిలో జరిగిన ఉపవాస పండుగలు గురువారంతో ముగిశాయి. దెందులూరు మండలం సోమవరప్పాడు శివారు వీరభద్రపురం గ్రామ పరిధిలోని బెయేర్షెబా మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో ప్రముఖ దైవజనులు బ్రదర్ సాల్మన్‌రాజు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రతి ఒక్కరూ దేవుడంటే భయం కలిగి ఆదర్శవంతమైన జీవనం సాగించాలని బ్రదర్ సాల్మన్‌రాజు అన్నారు. ముగింపు ప్రార్థన సందర్భంగా వందలాది మంది దైవజనులు, సంఘస్థుల ఆధ్వర్యంలో ప్రార్థనలు నిర్వహించారు.

రేపు కృష్ణాష్టమి వేడుకలు

ఏలూరు రూరల్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఈనెల 16న ఘనంగా నిర్వహించాలని ఏలూరు నగర యాదవ సంఘం నిర్ణయించింది. తమ్మిలేరు ఏటి గట్టున ఉన్న ఏలూరు జిల్లా యాదవ సంఘం కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నగర అధ్యక్షుడు మెరుగు మాల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఏలూరు జిల్లా యాదవ సంఘం భవనం వద్ద శనివారం ఉదయం శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా పూజా కార్యక్రమం సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తామన్నారు. ఆరోజు ఉదయం జరిగే శ్రీకృష్ణ భగవానుడి పూజా కార్యక్రమంలో ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌యాదవ్, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి ముఖ్యఅతిథులుగా హాజరవుతారని తెలిపారు. సాయంత్రం యాదవ సంఘం కార్యాలయం వద్ద ఉట్టి కొట్టే కార్యక్రమం కోలాహలంగా నిర్వహిస్తామన్నారు. కిలారపు జగదీష్, మల్లిపూడి రాజు, డొక్కు మల్లేశ్వరరావు, కొమ్మ నాగరాజు, ఆవాలు శ్రీనివాసరావు, కొమ్మ హుస్సేన్, కె.నాగ శ్రీనివాసరావు, జి.గోవర్ధన్, పాల్గొన్నారు.

మెగా ఆయిల్ పామ్ ప్లాంటేషన్ డ్రైవ్

ఉంగుటూరు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్కువ ఆదాయం వచ్చే సంప్రదాయ వ్యవసాయ పంటలు నుంచి అధిక ఆదాయం ఇచ్చే వాణిజ్య పంటలు అయిన ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి పెట్టాలని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, అప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు కోరారు. గురువారం యర్రమిల్లిపాడు గ్రామ ఆయకట్టులో గోద్రేజ్ ఆగ్రోవెట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా ఆయిల్ పామ్ ప్లాంటేషన్ డ్రైవ్ నిర్వహించారు. గన్ని వీరాంజనేయులు, ఎమ్మెల్యే ధర్మరాజు పాల్గొని రైతులకు కేంద్ర ప్రభుత్వ సంస్థలు అందిస్తున్న ప్రోత్సాహకాలను వివరించారు. జిల్లా ఉద్యానవన అధికారి రామ్మోహన్, సర్పంచ్ తమ్మిన శ్రీను, ఉంగుటూరు మార్కెట్ కమిటీ చైర్మన్ జ్యోతి అయ్యప్ప, నారాయణపురం సొసైటీ చైర్మన్ కడియాల రవిశంకర్ పాల్గొన్నారు.

చక్ర బంధనం!

(7వ పేజీ తరువాయి)

కూడా ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నాయి. ఎన్నిసార్లు డ్రెయినేజీలపై ఆక్రమణలు తొలగించినా తిరిగి ఆక్రమణలకు గురవ్వడంతో ట్రాఫిక్ సమయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఆక్రమణలు తొలగించి రోడ్లపై ఉండే కూరగాయల దుకాణాలను రైతుబజారుకు తరలించి సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేయాలని స్థానికులు, వాహనదారులు అధికారులను కోరుతున్నారు.



చింతలపూడి బోసుబొమ్మ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ ఐల్యాండ్

విస్తరణ లేని రోడ్లు

జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెంలో జనాభా పెరుగుదలకు తగ్గట్టుగా రహదారులు విస్తరణ జరగకపోవడంతో ఇరుకు రహదారుల్లో ట్రాఫిక్ బాధలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పట్టణంలోని నాలుగు వైపుల ప్రధాన రహదారులన్నీ గుంతలుగా మారి ప్రజలు ప్రమాదాల బారిన పడేలా చేస్తున్నాయి. స్థానిక బోసుబొమ్మ సెంటర్లో సిగ్నల్ లైట్స్ నిరుపయోగంగా మారడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ట్రాఫిక్ పోలీసులు ఉన్నంత సేపు పరిస్థితి కొంత అదుపులోనే ఉంటోంది. ఉదయం, సాయంత్రం పాఠశాలల బస్సుల కారణంగా సుమారు గంటన్నర పాటు ట్రాఫిక్ కు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ఆర్టీసీ డిపో పక్క రోడ్డులో పాఠశాలలు అధికంగా ఉండడంతో ద్విచక్ర వాహనాలు, పాఠశాల బస్సులు, ఆటోల కారణంగా ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ట్రాఫిక్ పోలీసులను ఆ ప్రాంతంలో అందుబాటులో ఉంచాలని ప్రజలు కోరుతున్నారు.

మద్యం లొల్లి!

(7వ పేజీ తరువాయి)

ఇస్తూనే మరోవైపు దీనికి సమాంతరంగా పర్మిట్ రూమ్‌లను అనుమతించడం ఒక్కసారిగా మద్యం వ్యాపారులను షాక్‌కు గురి చేసింది. ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం ఒక బార్ నిర్వహించాలంటే రకరకాల నియమాలను పాటించాల్సిందే. ఒక్కో బార్‌కు స్థాయిని బట్టి 15 నుంచి 20 మంది రోజూవారీ పనిచేయడానికి నియమించుకోవాల్సి ఉంది. తగినంత విస్తీర్ణంలో మాత్రమే బార్‌లు ఏర్పాటు చేయాలి. దీనికి అదనంగా కరెంటుతో సహా వివిధ ఖర్చులు ఉండనే ఉంటాయి. కానీ కొత్త విధానం ప్రకారం అమల్లోకి వచ్చే బార్‌లు ఇంతకుముందు మాదిరిగా కాకుండా ఉదయం 10 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు తెరిచి ఉంచేలా కొంత సడలింపు ఇచ్చారు. ఇదొక్కటే బార్‌లకు దరఖాస్తు చేసుకునే వారికి కొందరి కొంత ఊరట.

ఇంతకుముందు.. ఇప్పుడు

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో వైన్ షాపులన్నీ ప్రభుత్వ ఆధీనంలోనే అమ్మకాలు సాగించేవి. వారికి ఇష్టమైన బ్రాండ్‌లనే జనానికి రుద్దేవారు. అదీ కూడా ఎక్కడా ప్రభుత్వ దుకాణాల ముందు మద్యం సేవించడానికి ఆస్కారం లేకపోవడంతో చెట్టుకిందో, పుట్టకిందో, రోడ్డు పక్కనో పూటుగా పట్టించేవారు. మద్యం సేవించాలనుకునే వారికి ఇంకోమార్గం.. ఆనాటి బార్లు. అన్ని బార్‌ల్లోని చీప్ దగ్గర్నుంచి మిగతా బ్రాండ్‌లన్నీ ఉండేవి. ఈ కారణంగా ప్రభుత్వం అప్పట్లో బార్‌లకు వేలం నిర్వహించింది.ఏలూరు నగరంలోనే ఒక్కో బార్ వేలంలో రూ.35 లక్షల నుంచి రూ.90లక్షల వరకు వేలం సాగింది. అన్ని రకాల బ్రాండ్‌లు, ఆఖరికి చీప్ కూడా ఇక్కడే అమ్ముకోవడం, వైన్‌షాపుల దగ్గర మద్యం సేవించడానికి అవకాశం లేక ఆనాటి బార్ నిర్వాహకులు కొంతలో కొంత ఒడ్డెక్కగలిగారు. కానీ ఇప్పుడు వైన్‌షాపుల దగ్గర, పర్మిట్ రూమ్‌ల్లో మద్యం సేవించడానికి పూర్తి అనుమతి వచ్చింది. ఆఖరికి చిల్లర తిండికి అవకాశం. ఇంకేముందీ చిన్న,చితకా అంతా మినీ బార్లను తలపించే ఈ పర్మిట్‌రూమ్‌ల వైపు చూడనున్నారు. ఈ దెబ్బతో బార్‌లకు ప్రత్యేకంగా వచ్చేవారు తాము ఊహించిన సంఖ్యలో ఉంటారా,ఉండారా అనేదే మద్యం వ్యాపారుల్లో మీమాంస. ఇదే తరుణంలో నాన్ రిఫండబుల్ రూ.ఐదు లక్షలకు తోడు ప్రతీ షాపు మరో పదివేలు రూపాయలు అదనంగా చెల్లించుకోవాల్సిందే. గతంలో ఈ పదివేలు వ్యవహారం లేదు.

స్వాతంత్ర్య దినోత్సవ రిహార్సల్ ఓకే



గౌరవ వందనం చేస్తున్న పోలీస్ సిబ్బంది

ఏలూరు క్రైం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): 79వ స్వాతంత్ర్య వేడుకలకు ఏలూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాట్లను ఏలూరు జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ గురువారం సాయంత్రం స్వయానా పరిశీలించారు. శుక్రవారం ఉదయం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర గృహనిర్మాణ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి శుక్రవారం ఉదయం 9.00 నిముషాలకు జాతీయ పతాక ఆవిష్కరణ చేయనున్నారు. నేపథ్యంలో గురువారం సాయంత్రం పోలీస్ కవాత్ రిహార్సల్స్ నిర్వహించారు. ఎస్పీ జాతీయ జెండా ఎగురవేసి పోలీస్ సిబ్బంది గౌరవ వందనాన్ని స్వీకరించి ప్రత్యేక వాహనంలో పోలీస్ పెరేడ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గ్రౌండ్‌లో ప్రోటోకాల్ ప్రకారం ఏర్పట్లను నిర్వహించాలని, ట్రాఫిక్‌నకు అంతరాయం లేకుండా వాహనాల పార్కింగ్ కోసం ప్రత్యేక స్థలాలను కేటాయించాలన్నారు. ప్రజలకు సీట్లను ఏర్పాటు చేయాలన్నారు. మైదానం అంతా పరిశుభ్రంగా ఉండాలన్నారు. మంచి నీటి సదుపాయం కల్పించాలని సూచించారు. ఎస్పీతో పాటు అదనపు ఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు, ఎఆర్ డీఎస్పీ చంద్రశేఖర్, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.



గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ కిశోర్



మూసివేసిన అండర్ గ్రౌండ్ రోడ్డు





నగరంలోని లోతట్టు ప్రాంతాల్లో నిలిచిపోయిన వరద నీరు

జలమయం.. స్తంభించిన జనజీవనం

ఏలూరుటూటౌన్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాలకు నగరంలో పలు ప్రాంతాలు జలమయం అయ్యియి. ముఖ్యంగా విలీన గ్రామాలైన తంగెళ్లమూడి, సత్రంపాడు, శనివారపుపేట, వెంకటాపురం గ్రామాల్లో పలు కాలనీలు నీటమునిగాయి. ముఖ్యంగా బుధవారం రాత్రి ఎడతెరిపి లేకుండా వర్షం పడటంతో కాలనీలోని ఖాళీస్థలాలు చెరువులను తలపించాయి. దీంతో ప్రజలు పనికి వెళ్లడానికి వర్షపు నీరు వలన తీవ్ర ఇబ్బందులుపడ్డారు. నగరంలో ఆర్ఆర్.పేటలో లోబ్రిడ్జి పూర్తిగా మునిగిపోయింది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. రెండు వైపులా గేట్లు మూసి హెచ్చరిక బోర్డులు పెట్టారు. ఆర్.ఆర్.పేట, ఎన్ఆర్.పేట, పత్తేబాద, అశోక్‌నగర్, వన్‌టౌన్‌లోని పలు ప్రాంతాల్లో నీరు నిలిచిపోయింది. గురువారం వర్షం కొంచెం తగ్గుముఖం పట్టడంతో సహాయక చర్యలు చేపట్టారు. నగర పాలక సంస్థ కమిషనర్ భానుప్రతాప్, నీరు నిలిచిన పలు ప్రాంతాలను సందర్శించి మున్సిపల్ సిబ్బందితో వర్షపునీటిని బయటకు పంపే ఏర్పాట్లు చేశారు. డ్రైన్లలోని డ్రైన్లు శుభ్రం చేసి వర్షపునీరు ప్రవహించేలా చేశారు. లోబ్రిడ్జిలోని నీటినంతటిని తోడివేసి రాకపోకలు పునరుద్ధరించారు.

సొసైటీల అభివృద్ధికి నూతన కమిటీలు కృషి చేయాలి

ద్వారకాతిరుమల, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): దేశానికి వెన్నుముకగా ఉన్న రైతన్నలకు మేలు చేసేలా సహకార సంఘాలను అభివృద్ధి చేయాలని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు సూచించారు. ద్వారకాతిరుమల సొసైటీ చైర్మన్‌గా పోలిన శ్రీనివాసరావు (పీఎస్ఆర్) గురువారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరవగా నూతన చైర్మన్ పీఎస్ఆర్‌ను టీడీపీ నేతలు ఘనంగా సత్కరించారు.రైతు అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తానని తనకు ఈపదవి ఇచ్చిన సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే మద్దిపాటిలకు పీఎస్ఆర్ కృతజ్ఞతలు తెలియజేశారు.

గాలాయగూడెం సొసైటీ..

దెందులూరు: మండలంలోని గాలాయగూడెం సొసైటీలో త్రిసభ్య కమిటీ చైర్మన్‌గా జనసేన పార్టీ నాయకుడు పూజారి వెంకట రత్నం నాయుడు, సభ్యులుగా బీజేపీ నాయకులు మండూరి బుజ్జి గోపాల్, అక్కినేని కుచేంద్రలతో టీడీపీ గ్రామాధ్యక్షుడు పూజారి శ్రీనివాసరావులు ప్రమాణం చేయించారు. టీడీపీ మండలాధ్యక్షులు మాగంటి నారాయణ ప్రసాద్, ఏఎంసీ చైర్మన్ గారపాటి రామసీత ముఖ్య అతిథిగా పాల్గొని అభినందనలు తెలిపారు. బ్యాంక్ కార్యదర్శి పూజారి సుబ్బారావు, బ్యాంక్ అధ్యక్షులు గారపాటి కొండయ్య చౌదరి, బోడేటి మోహన్‌బాబు, తాతా సత్యనారాయణ, శివమణి గౌడ్, మోతుకూరి నాని, యలమర్తి శ్రీను, వెన్నమనేని రాజా శుభాకాంక్షలు తెలిపారు.

కృష్ణారావుపేట సొసైటీలో..

పోలవరం:మండలంలో కృష్ణారావుపేట ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం నూతన అధ్యక్షుడిగా కొణతాల ప్రసాద్ గురువారం నియమితులయ్యారు. త్రీమెన్ కమిటీ సభ్యులుగా ఎదిరేసి వెంకట్రావు,మిరియాల చంటి నియమితులయ్యారు. కొణతాల ప్రసాద్ గతంలో ఐదు పర్యాయాలు సొసైటీ అధ్యక్షులుగా పనిచేశారు. సొసైటీ అధ్యక్షుడిగా నియమితు లైన ప్రసాద్‌ను జనసేన నాయకులు గునపర్తి చిన్ని, మాజీ సర్పంచ్ అల్లు జగన్, జల్లేపల్లి వెంకట నర సింహరావు, కొల్లు శ్రీను, అనిశెట్టి రాధయ్య, సిద్ధన రామకృష్ణ పాల్గొన్నారు.



గాలాయగూడెంలో ప్రమాణ స్వీకారం దృశ్యం

లింగపాలెం మండలంలో..

ఏలూరు: లింగపాలెం, ధర్మాజీగూడెం, కె.గోకవరం, మఠంగూడెం గ్రామాల్లో సొసైటీల్లో త్రి సభ్య కమిటీ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. లింగపాలెంలో చైర్మన్‌గా మోరంపూడి మల్లికార్జునరావు, సభ్యులుగా వి.భాస్కరరావు, కె.వెంకటేశ్వరరావు, మఠంగూడెంలో చైర్మన్‌గా గరిమళ్ల చలపతిరావు, సభ్యులుగా ఎన్.మురళీ మోహన్, సి.హెచ్.రామకృష్ణ, ధర్మాజీగూడెంలో చైర్మన్‌గా నిమ్మగడ్డ సుధాకర్, సభ్యులుగా ఎన్.కృష్ణప్రసాద్, రంగాపురంలో చైర్మన్‌గా ఇనుగంటి దినేశ్, సభ్యులుగా సి.హెచ్.నాగచింతారావు, వై.శ్రీనుల చేత ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ ప్రమాణస్వీకారం చేయించారు. వేంపాటి ప్రసాద్, నందిగం సీతారామతిలక్, మోరంపూడి రంగారావు పాల్గొన్నారు.

జేపీ యూత్ ఆధ్వర్యంలో చెస్ పోటీలు

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): 78 వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం జేపీ యూత్ ఆధ్వర్యంలో జేపీ సెంటర్‌లో చెస్ పోటీలు నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ కె.వి. రమణ ఈ పోటీలను ప్రారంభించారు. సుమారు 80 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆర్‌జేఎన్ఎస్ వెంకటేశ్వరరావు, ఎ.చంద్రశేఖర్ ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. సీనియర్ విభాగంలో కెఎస్ఎస్.కార్తీక ప్రథమ స్థానం,కె.రాంబాబు ద్వితీయ స్థానం, జూనియర్స్ విభాగంలో ప్రథమ స్థానం ఎం.కుశాంక్, ద్వితీయ స్థారంలో వి.శ్రీఅధ్య, సబ్‌జూనియర్స్ విభాగంలో ప్రథమ స్థానం కె.నేహ, ద్వితీయ స్థానం పి.శివనాగు గెలుపొందినట్లు నిర్వాహకులు తెలిపారు. విజేతలకు స్వాతంత్ర్య దినోత్సవం రోజు శుక్రవారం బహుమతులు అందచేయనున్నట్లు తెలిపారు.

జాతీయ నాయకుల విగ్రహాల ఏర్పాటు

ఉంగుటూరు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): కైకరం హైస్కూలు పూర్వ విద్యార్థులు (1996-97 టెన్త్ బ్యాచ్) గురువారం హైస్కూలు ప్రాంగణంలో జాతీయ నాయకుల విగ్రహాలు ఏర్పాటు చేయగా హెచ్ఎం చేబ్రోలు శ్రీనివాసకుమార్ ప్రారంభించారు. పూర్వ విద్యార్థులు కోట దుర్గా ప్రసాద్, బోయిన నాగు, ప్రియాంకలు ఆర్థిక సాయం చేశారు. యెలిశెట్టి శ్రీనివాసరావు, శానం హరి, కోట జ్యోతి, రంగశ్రీ, పార్వతి పాల్గొన్నారు.

బకాయి బిల్లుల చెల్లింపు

ఉంగుటూరు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి):గత ప్రభుత్వంలో ఆగిపోయిన బిల్లులను చెల్లిస్తున్నట్లు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు పేర్కొన్నారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టర్లకు చెల్లించే బిల్లుల్లో 21 శాతం తగ్గించారన్నారు. రూ.50 లక్షల పాత బకాయి చెక్కులు కాంట్రాక్టర్లకు అందించగా వారంతా ఎమ్మెల్యే ధర్మరాజుకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రతి ఇంటా జాతీయ జెండా ఎగరాలి



చింతలపూడిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సొంగా

ఏలూరుసిటీ, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టరేట్‌లోని సీపీవో కార్యాలయంలో గురువారం హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని సీపీవో సి.హెచ్.వాసుదేవరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. సీపీవో వాసుదేవరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు దేశభక్తి కలిగి జాతీయ సమైక్యతకు సమగ్రతకు కృషి చేయాలని అన్నారు. మన జాతీయ జెండా ఎంతో విశిష్ఠత కలిగి ఉందన్నారు. పౌరులంతా తమ ఇంటి వద్ద జాతీయ జెండాను ఎగురవేయడం ద్వారా జాతీయ భావం ఉట్టిపడుతుందన్నారు. దేశ సమగ్రత, జాతీయ సమైక్యతకు త్రివర్ణ పతాకం స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బందితో కలిసి జాతీయ జెండా వద్ద సీపీవో సెల్ఫీదిగారు. అసిస్టెంట్ డైరక్టర్ శ్రీదేవి, డిప్యూటీ ఎస్‌టలు జె.రాజశేఖర్, సి.హెచ్.కేశవరావు, గంగాధర్, ప్రభాకర్‌రావు, డిస్ట్రిక్ట్ విజన్ యాక్షన్ ప్లాన్ సిబ్బంది పాల్గొన్నారు.

● ఏలూరు రూరల్: జాతీయ జెండాలను ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై ఎగరవేసి దేశభక్తిని చాటాలని పురావస్తు శాఖ అధికారిణి స్వర్ణ సత్యవతి అన్నారు. గురువారం దేశభక్తిని చాటేలా హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతీ పౌరుడు దేశ గౌరవాన్ని పెంపొందించాలన్నారు. మానవత స్వచ్ఛంద సంస్థ సభ్యులు విద్యార్థులు పాల్గొన్నారు.

● భీమడోలు: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని బీజేపీ నాయకులు గ్రామాల్లో జాతీయ జెండాలను ఇంటింటికీ పంపిణీ చేశారు. భీమడోలు శివారు వడ్లపట్ల గ్రామంలో ఆ పార్టీ నాయకుడు వర్థినీడి కపిరాజు ఆధ్వర్యంలో ఇంటింటికీ జాతీయ జెండాలను పంపిణీ చేశారు. స్వాతంత్ర్య దినోత్సవ విశిష్టతను వివరించారు. ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి పవన్ కుమార్ పాల్గొన్నారు.

● చింతలపూడి: హర్ ఘర్ తిరంగ కార్యక్రమంలో భాగంగా ఆగస్టు 15న ప్రతీ ఇంటా జాతీయ జెండా ఎగరాలని చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ పిలుపునిచ్చారు. గురువారం ఆంథోని నగర్ వద్ద జరిగిన జెండా ప్రదర్శనలో ఆయన పాల్గొని దేశ భక్తిని చాటారు. కళాశాల విద్యార్థులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ జాతీయ సమైక్యతకు, సమగ్రతకు కృషి చేయాలని అన్నారు. ఏరియా ఆసుపత్రి వద్ద కూడా డాక్టర్లు, ఆసుపత్రి సిబ్బంది తిరంగ కార్యక్రమంలో పాల్గొనగా ఎమ్మెల్యే హాజరయ్యారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోను నిర్వహించగా ప్రిన్సిపల్ పి.శ్రీనివాసరావు, అధ్యాపకురాలు సరస్వతి, విద్యార్థులు పాల్గొన్నారు.



బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే చంటి

వినాయక చవితి బ్రోచర్ల ఆవిష్కరణ

ఏలూరుకార్పొరేషన్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): పవరుపేటలోని విజయ గణపతి ఆలయం వద్ద ఈ నెల 27 నుంచి 31వ తేదీ వరకు జరగనున్న వినాయక చవితి చతుర్ది మహోత్సవాల బ్రోచర్లను ఆలయం వద్ద ఆవిష్కరించారు. ఆలయ ప్రధానార్చకులు కందుకూరి త్రినాథమూర్తి ఎమ్మెల్యేతో స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏఎంసీ చైర్మన్ మామిళ్ళపల్లి పార్థసారథి, కో-ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, కార్పొరేటర్ యర్రంశెట్టి సుమన్, డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి దాకారపు రాజేశ్వరరావు, ఆలయ కమిటీ సభ్యులు నౌడూరి వాసు, శీర్ల వాసు, వీరవల్లి రామకృష్ణ, ఘంటా బాబ్జీ, జి.రాంబాబు, ఎ.తిరుపతి ఉన్నారు.

కూటమి గెలుపు సంబరాలు

ద్వారకాతిరుమల, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): అధికారకాంక్షతో జగన్ ఇష్టమొచ్చినట్టు మాట్లాడుతున్నారని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు సూచించారు. ద్వారకాతిరుమల వచ్చిన ఆయన గురువారం విలేకర్లతో మాట్లాడుతూ తెలుగు ప్రజలకు జగన్ చరిత్ర గురించి అందరికీ తెలుసని ఎద్దేవా చేశారు.ప్రజాస్వామ్యయుతంగా పులివెందుల, ఒంటిమిట్టలో కూటమి గెలుపొందితే జీర్ణించుకోలేక మతిస్థిమితం లేని వ్యక్తిలా మాట్లాడుతున్నారని అన్నారు.

● కామవరపుకోట: కడప జిల్లా పులివెందుల, ఒంటిమెట్టలలో జరిగిన జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులు ఘన విజయం సాధించడంతో మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ మిత్రబృందం స్థానిక చౌతనా సెంటర్‌లో గురువారం వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. ఉప ఎన్నికల్లో విజయం సాధించిన టీడీపీ అభ్యర్థులు మారెడ్డి లతారెడ్డి, ముద్దు కృష్ణారెడ్డిలకు శుభాకాంక్షలు తెలియజేశారు.

● ఏలూరుటూటౌన్: రాష్ట్రంలో ఎన్నిక ఏదైన గెలుపు కూటమిదేనని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి ఎం.లతారెడ్డి ఘనవిజయం సాధించడంతో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో టీడీపీ నేలు స్వీట్లు పంచుకుని సంబరాలు చేసుకున్నారు. టీడీపీ యువత బాణసంచా కాల్చి సంబరాల్లో మునిగి తేలారు. ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ పులివెందుల ఎన్నిక కార్యకర్తల్లో జోష్ నింపిందన్నారు. ఇడా చైర్మన్ శివప్రసాద్, ఏఎంసీ చైర్మన్ పార్థసారథి, టీడీపీ నగర అధ్యక్షులు చోడే వెంకట రత్నం పాల్గొన్నారు.

● కొయ్యలగూడెం: పులివెందుల, ఒంటిమిట్ట మండలాల్లో టీడీపీ ఘన విజయం పట్ల సంబరాలు జరుపుకున్నారు. ఈ మేరకు మండలంలోని బయ్యన్నగూడెం గ్రామంలో నాయకులంతా కేకుకట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. మాజీ ఏఎంసీ చైర్మన్ పారేపల్లి రామారావు, మండల టీడీపీ అధ్యక్షుడు పారేపల్లి నరేశ్, వీ.శ్రీను, దుర్గారావు, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.


● చింతలపూడి: పులివెందుల, ఒంటిమిట్ట గెలుపుతో స్థానికంగా కార్యకర్తలు, నాయకులు విజయోత్సవాన్ని జరుపుకున్నారు. బాణసంచా కాల్చి మిఠాయిలు పంచారు. చింతలపూడి పీఏసీఎస్ అధ్యక్షులు తిరుమిశ్శి రామారావు, మాజీ సర్పంచ్ చిట్లూరి ధర్మరాజు, కొత్తపూడి శేషగిరిరావు, బోడా అనీష్ కుమార్, దూదిగం మోహన్‌రావు, విజయకుమారి, అప్పన్నదొర, నత్తా రవి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయ సలహాదారు సూర్యనారాయణ

ఐటీడీఏకు సుబ్బారెడ్డి పేరు పెట్టాలి

బుట్టాయగూడెం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి):ఏలూరు జిల్లా కెఆర్ పురం ఐటీడీఏ కార్యాలయానికి తొలి గిరిజన స్వాతంత్ర్య సమరయోధుడు కొరుకొండ సుబ్బారెడ్డి పేరును పెట్టాలని ఆదివాసీ మహాసభ అధ్యక్షుడు మిడియం వెంకట స్వామి, న్యాయ సలహాదారు అయినాపురపు సూర్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం బుట్టాయగూడెం జడ్పీ హైస్కూల్ ఆవరణలో జరిగిన సమావేశంలో నాయకులు పాల్గొని మాట్లాడుతూ సుబ్బారెడ్డి కుటుంబానికి తగిన గుర్తింపు ఇవ్వాలని కోరారు. బ్రిటిష్‌వారికి వ్యతిరేకంగా పోరాడిన 53 మంది గిరిజనుల స్మారక చిహ్నన్ని ఐటిడిఎ వద్ద నిర్మించాలన్నారు. ఆర్.యాకోబు, ఎం.వెంకటేష్, ఎం.భాస్కర కృష్ణంరాజు దొర, పి.విష్ణు, ఎం.రంజిత్ కుమార్, జి.వెంకట రమణ పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న డీజీఎం మాధవరావు

రుణాలపై కెనరా బ్యాంకు అవగాహన

ఏలూరు రూరల్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): రూరల్ మండలం మాదేపల్లిలో కెనరా బ్యాంక్ చాటపర్రు బ్రాంచ్ ఆధ్వర్యంలో గురువారం రైతులకు అవగాహన సదస్సు జరిగింది. ఈసదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన బ్యాంకు డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎం.మాధవ రావు మాట్లాడుతూ రైతులకు కెనరా బ్యాంక్ అందిస్తున్న సేవలను, రుణాలను వివరించారు. ఈ సదస్సుకు జాలిపూడి, మాదేపల్లి, చాటపర్రు ప్రాంతాలకు చెందిన రైతులు పాల్గొన్నారు. చాటపర్రు బ్రాంచ్ మేనేజర్ ఆదిరెడ్డి పాల్గొన్నారు.

నేడు నాయకుల పర్యటన

టి.నర్సాపురం, ఆగస్టు14(ఆంధ్రజ్యోతి): మండలంలో శుక్రవారం ఏలూరు ఎస్పీ పుట్టా మహేశ్‌కుమార్, ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శీలం వెంకటేశ్వరరావు గురువారం తెలిపారు. జాతీయ జెండాలను ఎగురవేయడంతో పాటు గ్రామాల్లో జరిగే అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారని తెలిపారు. కూటమి నాయకులు విజయవంతం చేయాలని కోరారు.

ఎంపీ పంద్రాగస్టు శుభాకాంక్షలు

ఏలూరు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ఎందరో మహానుభావులు తమ ప్రాణాలను త్యాగం చేయడం వల్లే ఇప్పుడు స్వాతంత్ర్య ఫలాలు అనుభవిస్తున్నామని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ పేర్కొన్నారు. శుక్రవారం జరుపుకునే 79వ స్వాతంత్ర్య వేడుకలు అందరి జీవితాల్లో వెలుగు నింపాలని ఆకాంక్షించారు.

ఆదుకోవాలని ఎమ్మెల్యేకు వినతి

ఉంగుటూరు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళలకు శుక్రవారం నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తున్న తరుణంలో ఆటో డ్రైవర్లు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజును కలిసి సమస్యలు తెలియజేశారు. ఉచిత బస్సు ప్రయాణం వల్ల తమ ఉపాధికి తీవ్ర ఆటంకం కలుగుతుందని, తమ కుటుంబాల్లో అనేక సమస్యలు తలెత్తుతాయని ఆదుకోవాలని ఎమ్మెల్యే ధర్మరాజును కోరారు.

17న రౌండ్ టేబుల్ సమావేశం

ఏలూరుకార్పొరేషన్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ట్రంప్ సుంకాలు-ఆక్వా కుదేలు అంశంపై ఈ నెల 17న ఉదయం 11 గంటలకు పవరుపేటలోని సీపీఎం కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్టు పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి గురువారం తెలిపారు. సమావేశానికి ఆక్వా రైతులు, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన వారు,ప్రజా సంఘాల వారు పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

గవర్నర్ మీట్ ఎట్‌కి నాగేంద్రసింగ్ ఎంపిక



ఏలూరు రూరల్, ఆగస్టు 14, (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గవర్నర్ కార్యాలయంలో జరిగే మీట్ ఎట్ కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితులుగా ఏలూరు జిల్లా నుంచి నాగేంద్రసింగ్ ఎంపికయ్యారు. ఈసందర్భంగా గవర్నర్ కార్యాలయం నుంచి ఆహ్వానం అందినట్టు నాగేంద్ర సింగ్ తెలిపారు. ప్రాథమిక స్థాయిలో దివ్యాంగ అంపైర్‌గా సేవలందించినందుకు గవర్నర్ మీట్ ఎట్ కార్యక్రమానికి ఆహ్వానం అందిందని ఆయన తెలిపారు.

సీఎం సమీక్షలో అధికారులు

పెదపాడు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల నేపథ్యంలో సీఎం చంద్రబాబు నిర్వహించిన సమీక్షలో నీటిసంఘాల అధ్యక్షులు బొప్పుడి కాశీబాబు, డి.రమేష్, అక్కినేని వంశీకృష్ణ, కె.రవికిరణ్, తహసీల్దారు కృష్ణజ్యోతి పాల్గొన్నారు.ముంపు ప్రాంతాల్లో అధికారులతో పాటు నీటి సంఘాల నాయకులు ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు.

జనార్దన స్వామికి పూజలు

ఏలూరుటూటౌన్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): శ్రీజనార్ధన స్వామి ఆశీస్సులతో ప్రజలంతా ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఎమ్మెల్యే బడేటి చంటి ఆకాంక్షించారు.అగ్రహారంలో ఉన్న స్వామివారి దేవస్థానం గోపురంలో ఎమ్మెల్యే చంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గర్భాలయంలో కొలువై ఉన్న స్వామి, అమ్మవార్లకు ఆలయ అర్చకులకు పవన్ కుమార్ ఆచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. టి.శ్రీనివాస్, మారం హనుమంతరావు, యు.నాగమునేశ్వరరావు పాల్గొన్నారు.

మసీదుపై దాడి విచారకరం

చింతలపూడి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లా త్రిపురాంతకం మండలం దూపాడు గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తులు మసీదును ధ్వంసం చేయడాన్ని ముస్లీం మైనార్టీ నాయకుడు ఆజాద్ ఖండించారు. పర్నీచర్, ఏసీని ధ్వంసం చేసి పుస్తకాలను దహనం చేసిన ఘటనపై విచారణ జరిపించాలని, ఇటువంటి దాడులు జరగడం విచారకరమన్నారు.

గాంధీ భవన్‌లో స్వరాజ్-79

నిడమర్రు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): పెదనిండ్రకొలను గాంధీభవన్‌లో స్వరాజ్ 79వ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా జిల్లా సర్వోదయ మండలి ఆధ్వర్యంలో గాంధీజీ ఆశించిన స్వరాజ్యం అనే అంశంపై విద్యార్థులకు వ్యాస రచన, వక్తృత్వం, చిత్రలేఖనం అంశాల్లో పోటీలు నిర్వహించి బహుమతులు పంపిణీ చేశారు. రచయిత జ్ఞాన ప్రసాద్ రచించిన జ్ఞానరంగస్థలం పుస్తకాన్ని ఆవిష్కరించారు. మండలి ప్రధాన కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు, సత్యనారాయణమూర్తి, కొచ్చర్లపాటి సుబ్బరాజు పాల్గొన్నారు.

రేపు శ్రీకృష్ణాష్టమి వేడుకలు

కైకలూరు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణాష్టమి వేడుకలను కైకలూరు శ్రీశ్యామలాంబ అమ్మవారి కళామండపం వద్ద నిర్వహిస్తున్నట్టు కైకలూరు శ్రీకృష్ణా యాదవ ఉత్సవ కమిటీ తెలిపింది. 16వ తేదీ ఉదయం 7 గంటలకు గోపూజ, 9 గంటలకు స్వామివారికి పూజ, 12 గం.కు ఊరేగింపు, 4 గం.కు కోలాట ప్రదర్శన, సాయంత్రం 6 గంటలకు ఉట్టి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు.

నూజివీడు డివిజన్‌లో విస్తారంగా వర్షాలు

నూజివీడు టౌన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): వాయుగుండం ప్రభావంతో నూజివీడు డివిజన్ వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు నమోదయ్యాయి. డివిజన్‌లో మొత్తం 331.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా సరాసరి వర్షపాతం 55.3గా నమోదైంది. అత్యధికంగా ముసునూరు మండలంలో 78.8 మిల్లీమీటర్లు నమోదు కాగా అత్యల్పంగా నూజివీడులో 41.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. చింతలపూడి మండలంలో 57.2 చాట్రాయి 55.6, లింగపాలెంలో 53.6, ఆగిరిపల్లిలో 45.2 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది.



కలిదిండిలో తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ

కలిదిండి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ఆధ్వర్యంలో కలిదిండి పట్టణంలో గురువారం హర్ ఘర్ తిరంగా ర్యాలీ, మానవహారం నిర్వహించారు. కలిదిండి ప్రభుత్వ జూనియర్ కళాశాల, సుగుణ డిగ్రీ కళా శాలల విద్యార్థులు పాల్గొన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు దుర్గా ప్రసాద్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రవీంద్ర, జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు బాండు రాజు, కోకా శ్రీనివాస్, ప్రిన్సిపాల్స్ త్రినాథ్, టి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ముదినేపల్లి: గ్రామీణ ప్రాంతాల్లో స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తి వెల్లివిరుస్తున్నది. ప్రజలు తమ గృహాలపై త్రివర్ణ పతాకాలను ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలన్న నేతల పిలుపునకు స్పందించిన గ్రామీణ వాసులు హర్ ఘర్ మే తిరంగా కార్యక్రమాన్ని ఆచరిస్తున్నారు. ముదినేపల్లిలో అమరావతి బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవి తమ నివాసంపై జాతీయ జెండాను ఎగురవేశారు.



తమ నివాసంపై జాతీయ జెండా ఏర్పాటుచేస్తున్న అమరావతి బ్రాండ్ అంబాసిడర్ వైష్ణవి

ప్లాంట్ వద్దు.. పేదలకు పట్టాలివ్వాలి : సీపీఎం



భూములను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

నూజివీడు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్న ఆగిరిపల్లిలో భూములు సాగు చేసుకుంటున్న పేదలకు పట్టాలు ఇవ్వాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. గ్రామంలో మంత్రి పార్థసారథి కుమారుడికి కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటుకు కేటాయించనున్న భూమిని సీపీఎం బృందం పరిశీలించింది. పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జి. రాజు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో పేదలు అనేక సంవత్సరాల నుంచి సాగు చేస్తున్న భూములకు పట్టాలివ్వకుండా పెట్టుబడిదారులకు కట్టబెట్టే యత్నాలను విరమించుకోవాలని, ప్లాంట్‌ను ఏర్పాటు చేయొద్దని ప్రజలు కోరుతున్నారన్నారు. ఈ ప్రాంతంలో పేదలు సాగు చేస్తున్న భూములకు పట్టాలు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పలువురు సీపీఎం నాయకులు పాల్గొన్నారు.



ముద్దరబోయినను కలిసిన ముసునూరు యాదవ యువకులు

కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించాలి

ముసునూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించి, యాదవుల ఐక్యతను చాటాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం నూజివీడు పార్టీ కార్యాలయంలో ముసునూరు యాదవ యూత్ ముద్దరబోయినను కలసి కృష్ణాష్టమి వేడుకులకు ఆహ్వానించారు. వేడుకల నిర్వహణ నిమిత్తం తన వంతుగా రూ. 15 వేలు విరాళంగా ముద్దరబోయిన వారికి అందజేశారు.

నానో యూరియా మేలు

చాట్రాయి, ఆగస్టు 14(ఆంధ్ర జ్యోతి): రైతులు నానో యూరియా ఉపయోగిస్తే పైరుకు, పర్యావరణానికి మేలు జరుగుతుందని ఏవో బి. శివశంకర్ అన్నారు. చాట్రాయిలో గురువారం నానో యూరియా ఉపయోగాలపై డెమో ద్వారా రైతులకు అవగాహన కల్పించి మాట్లాడుతూ యూరియా బస్తాకు ప్రత్యామ్నాయంగా ఒక బాటిల్ నానో యూరియా పనిచేస్తుందని పరిశోధనల్లో వెల్లడైందన్నారు. ప్రైవేటు డీలర్లు యూరియా అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రత్యేక రైళ్ల పొడిగింపు

ఏలూరు క్రైం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా మీదుగా నడుస్తున్న రెండు ప్రత్యేక రైళ్ళను పొడిగిస్తున్నట్టు విజయవాడ దక్షిణ మధ్య రైల్వే శాఖాధికారులు ప్రకటించారు. రైల్ నంబర్ 07031 చర్లపల్లి నుంచి కాకినాడ టౌన్‌కు ప్రతి శుక్రవారం రాత్రి 7.30 గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 9 గంటలకు కాకినాడ టౌన్‌కు చేరుకుంటుంది. ఈ రైలు ఆగస్టు 15, 22, 29 తేదీల్లో నడుస్తుంది. రైల్ నంబర్ 07032 కాకినాడ టౌన్ నుంచి చర్లపల్లి ప్రతి ఆదివారం రాత్రి 8.10 గంటలకు కాకినాడ టౌన్‌లో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 8.30 గంటలకు చర్లపల్లి చేరుతుంది. ఈ రైలు ఆగస్టు 17, 24, 31 తేదీల్లో నడపనున్నారు. ఈ రెండు రైళ్ళు నల్గొండ, మిర్యాలగూడ, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, గుడివాడ, కైకలూరు, ఆకివీడు, భీమవరం టౌన్, తణుకు, రాజమండ్రి, సామర్లకోట స్టేషన్లలో ఆగనున్నాయి. ఈ రైళ్ళల్లో టూ టైర్ ఏసీ, త్రీ టైర్ ఎసీ, స్లీపర్, జనరల్, సెకండ్ క్లాస్ కోచ్‌లు ఉంటాయని అధికారులు తెలిపారు.



నీట మునిగిన వెలంపేట స్కూలు రోడ్డు



చీపురుగూడెం వద్ద తమ్మిలేరులో వరద ప్రవాహం



అన్నవరం జగనన్న కాలనీలో నిలిచిన నీరు



మద్వానిగూడెం – పెదలంక రహదారి ఇలా..

అతలాకుతలం

»భారీ వర్షాలకు రహదారులు జలమయం »తమ్మిలేరు వరదతో స్తంభించిన రాకపోకలు

కైకలూరు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): అల్పపీడనం ప్రభావంతో కురిసిన భారీ వర్షానికి రహదారులు, డ్రైన్లు, కాలువలు పొంగి పొర్లాయి. బుధవారం సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు కుండపోతగా వర్షం కురవడంతో జన జీవనం అస్తవ్యస్తమైంది. ప్రజలు బయటకు వెళ్లలేని పరిస్థితులు నెలకొనడంతో ఎక్కడికక్కడ నిలిచిపోయారు. కైకలూరులో వెలంపేట ఎంపీ యూపీ స్కూల్ రోడ్డు, అలాగే కైకలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల జాతీయ రహదారి పూర్తిగా జలమయమైంది. డ్రైన్లన్నీ పొంగి రోడ్లపై ప్రవహించాయి. ఇదిలా ఉండగా పంట పొలాల్లో భారీగా వర్షపునీరు చేరడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నిలిచిన రాకపోకలు

చాట్రాయి: బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు తమ్మిలేరు ప్రాజెక్టుకు మోస్తరుగా వరద వస్తోంది. మండలంలోని చిన్నంపేట, చింతలపూడి మండలం శివపురం గ్రామాల మధ్య తమ్మిలేరుపై ఉన్న కాజ్‌వే దగ్గర ప్రవహిస్తున్న వరదను ప్రజలు, రైతులు అధిక సంఖ్యలో వచ్చి తిలకిస్తున్నారు. అలాగే ఇదే మండలంలోని చీపురుగూడెం, చింతలపూడి మండలం మల్లాయగూడెం మధ్య తమ్మిలేరులో వరద ప్రహిస్తుండటంతో ప్రజల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. గురువారం సాయంత్రానికి తమ్మిలేరు ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో 850 క్యూసెక్కులు, ప్రాజెక్టు నీటి సామర్థ్యం 355 అడుగులు కాగా, ప్రస్తుతం ప్రాజెక్టు నీటిమట్టం 233 అడుగులు ఉన్నట్లు తమ్మిలేరు ప్రాజెక్టు ఏఈ లాజర్‌బాబు తెలిపారు.

అధ్వానంగా జగనన్న కాలనీలు

ముదినేపల్లి: వర్షాలకు ముదినేపల్లి మండలంలోని పలు జగనన్న కాలనీలు అధ్వానంగా మారాయి. రోడ్లు నిర్మించకపోవటంతో నడవలేక కాలనీ వాసులు నరకయాతన అనుభవిస్తున్నారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పేరూరు, అన్నవరం కాలనీల్లో నీరు నిలిచింది. ఈ కాలనీల్లో ఒక్క అంతర్గత రహదారి కూడా గత ఐదేళ్లలో నిర్మించకపోవటంతో కాలనీల వాసులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. నీళ్లలో పాములు సంచరిస్తున్నట్లు చెబుతున్నారు. అంతర్గత రహదారులు నిర్మించి సమస్యను పరిష్కరించాలని అన్నవరం కాలనీ వాసి రవి కోరుతున్నారు.

కలిదిండి: భారీ వర్షాలు కురుస్తుండటంతో మద్వానిగూడెం - పెదలంక, మూల్లంక - పెదలంక, కలిదిండి - పోతుమర్రు, ఆరుతెగలపాడు - కాళ్లపాలెం వయా తాడినాడ ప్రధాన రహదారులు పెద్ద గోతులు పడి ధ్వంసమయ్యాయి. గోతుల్లో వర్షపు నీరు నిల్వ ఉండటంతో చెరువులను తలపిస్తున్నాయి. దీంతో వాహనదారులు పలు అవస్థలు పడుతున్నారు. లోడు వాహనాలు గోతుల్లో ఇరుక్కుపోవటంతో గంటల తరబడి ట్రాఫిక్ స్తంభించిపోతోంది. ద్విచక్ర వాహన చోదకులు గోతుల్లో పడి క్షతగాత్రులవుతున్నారు. ఈ రహదారులపై ప్రయాణీకులు నరకయాతన అనుభవిస్తున్నారు. బస్సులు, ఆటోలు సక్రమంగా రాకపోకలు సాగించటం లేదు. ఆయా గ్రామాల నుంచి కలిదిండి, బంటుమిల్లి, భీమవరం కళాశాలలకు వెళ్లి వచ్చే విద్యార్థులు, ఆసుపత్రికి వెళ్లే వృద్ధులు, గర్భిణులు, చంటి పిల్లల తల్లులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి ధ్వంసమైన రహదారులకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



ఆందోళనకారులకు నచ్చచెబుతున్న పోలీసులు

తాగునీటి కోసం రాస్తారోకో

మండవల్లి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): మండవల్లి స్టేషన్ రోడ్డులో తాగునీటి కోసం గ్రామస్థులు జాతీయ రహదారి 165పై గురువారం ధర్నా, రాస్తారోకో చేశారు. స్టేషన్ రోడ్డు చిన్నసెంటర్ వాసులకు 20 రోజుల నుంచి కుళాయిలు రావటం లేదని, పంచాయతీ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా కనీసం పట్టించుకోవడం లేదని వాపోయారు. జాతీయ రహదారిపై మహిళలు ఖాళీ బిందెలతో ధర్నా నిర్వహించారు. సర్పంచ్, అధికారులు రావాలని డిమాండ్ చేశారు. కొద్దిసేపు అనంతరం పోలీసులు వచ్చి వారికి నచ్చజెప్పి ధర్నా విరమింపజేశారు. తమగోడు ఎవరూ పట్టించుకోవడం లేదని, ఎన్ని రోజులు ఓపిక పట్టాలని వారు పోలీసులు వద్ద వాపోయారు.



సీఎం చంద్రబాబుకు వినతిపత్రం సమర్పిస్తున్న అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్

సీఎంను కలిసిన అండ్రాజు

కలిదిండి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): అగ్నికుల క్షత్రియుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అండ్రాజు శ్రీనివాస్ మంగళగిరి పార్టీ కార్యాలయంలో సీఎం చంద్రబాబును కలసి వినతిపత్రం సమర్పించారు. కాకినాడ జిల్లాను విద్యాదాత మల్లాడి సత్యలింగ నాయకర్ జిల్లాగా మార్చాలని, దక్షిణ కాశీగా పేరొందిన అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని నిర్మించిన కొపనాతి కృష్ణమ్మ వారసులను ఆలయ చైర్మన్‌గా నియమించాలని విన్నవించారు. అందుకు సీఎం సానుకూలంగా స్పందించారని అండ్రాజు తెలిపారు.

టీడీపీ ఘన విజయంపై హర్షం

చాట్రాయి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ స్థానాలను టీడీపీ భారీ మెజారిటీతో కైవసం చేసుకోవటం పట్ల జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి మందపాటి బసవారెడ్డి, తెలుగురైతు జిల్లా ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు, పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇజ్జిగాని వెంకటేశ్వరరావు, తేళ్ళూరి శేఖర్, మండల మాజీ అధ్యక్షుడు మరిడి చిట్టిబాబు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైయస్ కుటుంబం సుదీర్ఘ కాలం ఫ్యాక్షన్ రాజకీయాలతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడుతూ గెలిపొందారనేది జగమెరిగిన సత్యం అన్నారు. కూటమి పాలనలో ఎన్నికలు స్వేచ్ఛగా జరగటంతో ఓటర్లు తమ ఓట్లు తాము వేసుకొని టీడీపీకి పట్టం కట్టారని, ఇది ప్రజాస్వామ్య విజయమన్నారు.

లోతట్టు ప్రాంతాలను పరిశీలించిన సబ్ కలెక్టర్



నూజివీడు టౌన్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): నూజివీడు మున్సిపల్ పరిధిలోని లోతట్టు ప్రాంతాలను సబ్ కలెక్టర్ వినూత్న గురువారం పరిశీలించారు. పట్టణ పరిధిలోని మొగళ్ళ చెరువు, పెద్ద చెరువు, గొడుగువారిగూడెం, ఆర్‌ఆర్‌పేట, ఎంప్లాయిస్ కాలనీ, తిరువూరు బస్టాండ్ రోడ్డు, బైపాస్ రోడ్డు ప్రాంతాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ గత ఏడాది భారీ వర్షాల నేపథ్యంలో నెలకొన్న అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ప్రస్తుత పరిస్థితులలో ఎలాంటి నష్టం సంభవించకుండా తగిన ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టామన్నారు. లోతట్టుగా ఉన్న మొగళ్ళ చెరువు, పెద్ద చెరువు ప్రాంతాలను ఇరిగేషన్, మున్సిపల్ అధికారుల బృందంతో కలిసి పరిశీలించినట్లు వివరించారు. 24 గంటలు అధికారుల పర్యవేక్షణ కొనసాగుతుందన్నారు. చెరువుల వద్ద కట్టలు పటిష్ఠంగా ఉండేందుకు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టినట్లు వివరించారు. ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా కంట్రోల్ రూమ్ వద్ద సిద్ధంగా ఉండే సిబ్బంది సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇరిగేషన్ డీఈ అర్జునరావు, మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



గంగానమ్మ ఉత్సవాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కామినేని

ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలి : కామినేని

కైకలూరు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): గ్రామదేవత గంగానమ్మ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. గురువారం కైకలూరు బైపాస్ రోడ్డులోని గంగానమ్మ సంబరాలను ఆయన ప్రారంభించి మాట్లాడుతూ భక్తుల కోర్కెలను తీర్చే ఇలవేల్పుగా అమ్మవారిని కొలు స్తారని, ఉత్సవాల్లో భక్తులు పెద్దఎత్తున పాల్గొనాలన్నారు. అనంతరం విచిత్ర వేషధారణలు, తీన్మార్ డప్పుల నడుమ గ్రామ పురవీధుల్లో అమ్మవారిని ఊరేగించారు. ఆదివారంతో ఉత్సవాలు ముగుస్తాయి. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు ఘనంగా స్వాగతం పలికారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల రావు, కైకలూరు సర్పంచ్ కేవీఎస్ఎం నాయుడు, టీడీపీ నాయకులు బీకేఎం నాని, పూల రామచంద్రరావు, బోయిన శ్రీనివాసరావు, జనసేన నాయకులు కొల్లి వరప్రసాద్, తులసి పూర్ణ, నాగరాజు, తోట లక్ష్మి, బీజేపీ నాయకులు పేరిచర్ల ప్రసాదరాజు, బోడావుల జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి

మండవల్లి: రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని కైకలూరు ఎమెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ పేర్కొన్నారు. మండలంలోని లింగాలలో సచివాలయ నూతన కార్యాలయం ప్రారంభించారు. వైసీపీ విధ్వంస పాలన నుంచి రాష్ట్రానికి విముక్తి కలిగిందని, సంక్షేమం, అభివృద్ధి కూటమి ప్రభుత్వం నెలకొల్పుతోందన్నారు. త్వరలో లింగాల గ్రామంలో రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. అనంతరం ఆది వినాయక స్వామి విగ్రహ ప్రతిష్ఠమహోత్సవం పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, సర్పంచ్ బోయిడి ధనలక్ష్మీ, సురేష్, పెద్ద ఎత్తున భక్తులు నాయకులు పాల్గొన్నారు.

చక్ర బంధనం!

(7వ పేజీ తరువాయి)

కూడా ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నాయి. ఎన్నిసార్లు డ్రెయినేజీలపై ఆక్రమణలు తొలగించినా తిరిగి ఆక్రమణలకు గురవ్వడంతో ట్రాఫిక్ సమయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఆక్రమణలు తొలగించి రోడ్లపై ఉండే కూరగాయల దుకాణాలను రైతుబజారుకు తరలించి సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేయాలని స్థానికులు, వాహనదారులు అధికారులను కోరుతున్నారు.

విస్తరణ లేని రోడ్లు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెంలో జనాభా పెరుగుదలకు తగ్గట్టుగా రహదారులు విస్తరణ జరగకపోవడంతో ఇరుకు రహదారుల్లో ట్రాఫిక్ బాధలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పట్టణంలోని నాలుగు వైపుల ప్రధాన రహదారులన్నీ గుంతలుగా మారి ప్రజలు ప్రమాదాల బారిన పడేలా చేస్తున్నాయి. స్థానిక బోసుబొమ్మ సెంటర్లో సిగ్నల్ లైట్స్ నిరుపయోగంగా మారడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.ట్రాఫిక్ పోలీసులు ఉన్నంతసేపు పరిస్థితి కొంత అదుపులోనే ఉంటోంది. ఉదయం, సాయంత్రం పాఠశాలల బస్సుల కారణంగా సుమారు గంటన్నర పాటు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ఆర్టీసీ డిపో పక్క రోడ్డులో పాఠశాలలు అధికంగా ఉండడంతో ద్విచక్ర వాహనాలు, పాఠశాల బస్సులు, ఆటోల కారణంగా ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ట్రాఫిక్ పోలీసులను ఆ ప్రాంతంలో ఉంచాలని ప్రజలు కోరుతున్నారు.

బీజేపీ అద్దె మైకు జగన్ : గోళ్ల

నూజివీడు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): బీజేపీ అద్దె మైకు జగన్‌మోహన్‌రెడ్డి నోటిని అదుపులో పెట్టుకుని మాట్లాడితే బాగుంటుందని యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోళ్ళ పవన్‌కుమార్ విమర్శించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎలక్షన్ కమిషన్ నిర్ణయాలపై రాహుల్ గాంధీ పోరాటం చేస్తుంటే మద్దతుగా నిలవాల్సిందిపోయి రాహుల్ గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. గత 12 ఏళ్లుగా బెయిల్‌పై ఉన్న జగన్ బీజేపీ మద్దతుతో ఒక్కసారి కూడా కోర్టుకు హాజరు కాలేదన్నారు. రాజశేఖర్‌రెడ్డి వారసురాలు ఆయన ఆశయాల సాధన కోసం పోరాటం చేస్తున్న షర్మిలమ్మ అవుతుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ బలం పుంజుకుంటున్నందున జగన్ కాంగ్రెస్‌ను టార్గెట్ చేసుకున్నారని విమర్శించారు.

గౌడ సంఘ నాయకుల హర్షం

చాట్రాయి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు, సర్దార్ గౌతు లచ్చన్న జయంతిని అధికారికంగా నిర్వహించాలని కూటమి ప్రభుత్వం జీవో విడుదల చేయటం పట్ల నూజివీడు నియోజకవర్గ గౌడ సంఘం అధ్యక్షుడు కందుల కృష్ణ, చాట్రాయి మండల గౌడ సంఘం అధ్యక్షుడు పానుగళ్ళ కోటేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ జీవితాంతం పేదల సంక్షేమానికి పోరాడిన గొప్ప నేత లచ్చన్నకు సముచిత గౌరవం ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి గౌడ కులస్తుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. 16న లచ్చన్న 166వ జయంతిని ఘనంగా నిర్వహించటానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు నాయకులు చెప్పారు.

పెండ్లి కుమారుడికి బంగారు నాణెం అందజేత

చాట్రాయి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): కృష్ణామిల్క్ యూనియన్ కల్యాణమస్తు పథకం కింద కొత్తగూడేనికి చెందిన పాడిరైతు చల్లగుళ్ళ నాగశిరోమణి కుమారుడి వివాహం సందర్భంగా రూ. 20 వేలు విలువైన బంగారు నాణేన్ని గురువారం సంస్థ డైరెక్టర్ బొట్టు రామచంద్రరావు అందజేశారు. క్లస్టర్ మేనేజర్ దిలీప్ కుమార్, సంఘాధ్యక్షురాలు గంగారత్నం, సూపర్‌వైజర్ నరసింహారావు, పాడి రైతులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వర స్వామి పవిత్రోత్సవాలు ప్రారంభం

ముదినేపల్లి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటరులోని శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో గురువారం స్వామివారి పవిత్రోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ రుద్రరాజు గంగాశ్రీదేవి స్వామి వార్లకు పూజలు నిర్వహించి ప్రారంభించిన ఈ పవిత్రోత్సవాల్లో యాజ్ఞికులు, అర్చకులు గూడూరు రామకృష్ణ శర్మ, తోలేటి వీరభద్రశర్మ, కోట శివశంకరశర్మ, రుద్రపాక బాలగంగాధర తిలక్ స్వామికి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు విశేషంగా పాల్గొన్నారు. ఉత్సవాలు ఈ నెల 16 వరకు జరుగుతాయి.

(7వ పేజీ తరువాయి)

మద్యం లొల్లి!

ఇస్తూనే మరోవైపు దీనికి సమాంతరంగా పర్మిట్ రూమ్‌లను అనుమతించడం ఒక్కసారిగా మద్యం వ్యాపారులను షాక్‌కు గురిచేసింది. ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం ఒక బార్ నిర్వహించాలంటే రకరకాల నియమాలను పాటించాల్సిందే. ఒక్కో బార్‌కు స్థాయిని బట్టి 15 నుంచి 20 మంది రోజూవారీ పనిచేయడానికి నియమించుకోవాల్సి ఉంది. తగినంత విస్తీర్ణంలో మాత్రమే బార్‌లు ఏర్పాటు చేయాలి. దీనికి అదనంగా కరెంటుతో సహా వివిధ ఖర్చులు ఉండనే ఉంటాయి. కానీ కొత్త విధానం ప్రకారం అమల్లోకి వచ్చే బార్‌లు ఇంతకుముందులా కాకుండా ఉదయం 10 నుంచి రాత్రి 12 గంటల వరకు తెరిచి ఉంచేలా కొంత సడలింపు ఇచ్చారు. ఇదొక్కటే బార్‌లకు దరఖాస్తు చేసు కునే వారికి కొందరి కొంత ఊరట.

ఇంతకుముందు.. ఇప్పుడు

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో వైన్ షాపులన్నీ ప్రభుత్వ ఆధీనంలోనే అమ్మకాలు సాగించేవి. వారికి ఇష్టమైన బ్రాండ్‌లనే జనానికి రుద్దేవారు. అదీ కూడా ఎక్కడా ప్రభుత్వ దుకాణాల ముం దు మద్యం సేవించడానికి ఆస్కారం లేకపోవడంతో చెట్టుకిందో, పుట్టకిందో, రోడ్డు పక్కనో ఫూటుగా పట్టించేవారు. మద్యం సేవిం చాలనుకునే వారికి ఇంకో మార్గం.. ఆనాటి బార్లు. అన్ని బార్‌ల్లోని చీప్ దగ్గర్నుంచి మిగతా బ్రాండ్‌లన్నీ ఉండేవి. ఈ కారణంగా ప్రభుత్వం అప్పట్లో బార్‌లకు వేలం నిర్వహించింది.ఏలూరు నగరంలోనే ఒక్కో బార్ వేలంలో రూ.35 లక్షల నుంచి రూ.90లక్షల వరకు వేలం సాగింది. అన్ని రకాల బ్రాండ్‌లు, ఆఖరికి చీప్ కూడా ఇక్కడే అమ్ముకోవడం, వైన్‌షాపుల దగ్గర మద్యం సేవించడానికి అవకాశం లేక ఆనాటి బార్ నిర్వాహకులు కొంతలో కొంత ఒడ్డెక్కగలిగారు. కానీ ఇప్పుడు వైన్‌షాపుల దగ్గర, పర్మిట్ రూమ్‌ల్లో మద్యం సేవించడానికి పూర్తి అనుమతి వచ్చింది. ఆఖరికి చిల్లర తిండికి అవకాశం. ఇంకేముందీ చిన్నచితకా అంతా మినీ బార్లను తలపించే ఈ పర్మిట్‌రూమ్‌ల వైపు చూడనున్నారు. ఈ దెబ్బతో బార్‌లకు ప్రత్యేకంగా వచ్చేవారు తాము ఊహించిన సంఖ్యలో ఉంటారా,ఉండారా అనేదే మద్యం వ్యాపారుల్లో మీమాంస. ఇదే తరుణంలో నాన్ రిఫండబుల్ రూ.ఐదు లక్షలకు తోడు ప్రతీ షాపు మరో పదివేలు రూపాయలు అదనంగా చెల్లించుకోవాల్సిందే. గతంలో ఈ పది వేలు వ్యవహారం లేదు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	232
చికెన్ స్కిన్‌లెస్	242
నెక్ కోడి గుడ్డు ధర	(100)
విజయవాడ జోన్ రైతు ధర	రూ.475

హుండీల దొంగ దొరికాడు



విలేకరులతో మాట్లాడుతున్న నూజివీడు డీఎస్పీ

నూజివీడు టౌన్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ఆలయాలు, ప్రార్థనా మందిరాల్లో హుండీ దొంగతనాలు చేస్తున్న అంతర్ జిల్లా దొంగను నూజివీడు సర్కిల్ పోలీసులు అరెస్టు చేశారు. నూజివీడు డీఎస్పీ కేవీవీఎన్‌వీ ప్రసాద్ వివరాలు ప్రకారం రాత్రి వేళల్లో ఆలయాల్లోకి ప్రవేశించి హుండీ తాళాలు పగలగొట్టి నగదును దొంగలించే ఏలూరుకు చెందిన తాజ్‌ఖాన్ కుమారుడు పఠాన్ సలార్‌ఖాన్‌ను గురువారం అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు. నూజివీడు సీఐ కె రామకృష్ణ ఆధ్వర్యంలో చాట్రాయి ఎస్‌ఐ డి. రామకృష్ణ చాట్రాయి గ్రామంలోని కొత్త ఆంజనేయస్వామి గుడి వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా పోలవరం వైపు నుంచి చాట్రాయికి మోటార్‌సైకిల్‌పై వస్తున్న సలార్‌ఖాన్ వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులను గమనించి మోటార్ సైకిల్‌పై పారిపోవడానికి యత్నించగా చాట్రాయి పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకుని అతని నుంచి రూ.5900 నగదు, మోటార్ సైకిల్‌ని స్వాధీనపరుచుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. నిందితుడిపై ఇప్పటి వరకు వివిధ జిల్లాల్లో మొత్తం 51 దొంగతనం కేసులు ఉండగా ఏలూరు జిల్లాలో 25, నెల్లూరు జిల్లాలో 23, ఎన్టీఆర్ జిల్లాలో మూడు కేసులు ఉన్నాయన్నారు. నిందితుడి స్వస్థలం ఏలూరు అయినా ప్రస్తుతం నెల్లూరు జిల్లాలో నివాసం ఉంటున్నట్లు ఆయన తెలిపారు. నిందితుడిని పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన హెడ్ కానిస్టేబుల్ విజయ్‌భాస్కర్, శ్రీనివాసరావు, కానిస్టేబుల్ బాలాజీ, శ్రీనివాసులను డీఎస్పీ అభినందించారు. నూజివీడు సీఐ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

ముదినేపల్లి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి-గుడివాడ రహదారిలో కల్వపూడి సత్రవ సమీపంలో ఈ నెల 4వ తేదీ రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో తీవ్ర గాయాలకు గురైన వడాలికి చెందిన నూలు వెంకట వరలక్ష్మి (55) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించింది. ప్రమాదానికి గురైన ఈ మహిళను గుడివాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించగా, మెరుగైన వైద్యం కోసం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం మృతి చెందినట్లు ఎస్‌ఐ వీరభద్రరావు తెలిపారు.